
పోలీసులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తదితరులు

గరం గరం

ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో వైసీపీలో పరిస్థితి గరంగరంగా మారుతోంది. ఇప్పటికే నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు పార్టీకి దూరమయ్యారు. తాజాగా పలువురు ఆయన బాటలో పయనించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో వైసీపీ నేతల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. ఇప్పటి వరకు సమావేశాలు, ప్రకటనలకే పరిమితమైన అసమ్మతి ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమైంది. జగన్‌పై కినుకతో ఉన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి నేరుగా రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై ప్రత్యక్ష పోరుకు సిద్ధమయ్యారు. మరోవైపు వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. కొద్దిరోజులుగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న మక్కెన తన అభిమానులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి వారి సమక్షంలోనే వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పల్నాట అధికార పార్టీలో రాజకీయం రంజుగా మారుతుండగా.. స్థానిక నేతపై వివక్ష చూపుతూ రాజకీయ బదిలీపై తీసుకువచ్చిన నేతపై అధిష్ఠానం ఆపేక్ష చూపుతుండటంపై క్యాడర్ అయోమయానికి గురవుతోంది.

- పల్నాడు వైసీపీలో విభేదాలు
- గురజాలలో కాసు వర్సెస్ జంగా
- ఫ్లెక్సీల్లో జంగా ఫొటో లేదని తొలగింపు
- స్వగ్రామంలో కార్యక్రమానికి పిలుపులేదని ఎమ్మెల్సీ ఆగ్రహం
- గామాలపాడులో కాసు, కృష్ణమూర్తి వర్గీయుల మధ్య ఉద్రిక్తత

ప్రొటోకాల్ రగడ.. సభ వాయిదా

- ఎందుకొచ్చారని అధికారులపై జంగా ప్రశ్నల వర్షం

దాచేపల్లి, పిడుగురాళ్ల, ఫిబ్రవరి 4: గురజాలలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి.. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఎమ్మెల్సీ అయినా నియోజకవర్గంలో తనకు సరైన గౌరవం దక్కడం లేదని జంగా ఆగ్రహంతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో సొంత గ్రామంలో జరిగే ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి తనకు ఆహ్వానం లేకపోవడంపై జంగా మండిపడుతున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కాసు, ఎమ్మెల్సీ జంగా వర్గీయుల మధ్య దాచేపల్లి మండలంలోని గామాలపాడులో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జంగా కృష్ణమూర్తి స్వగ్రామమైన గామాలపాడులో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం, కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన తదితర కార్యక్రమాలను ఆదివారం ఏర్పాటు చేశారు. స్వగ్రామమైన గామాలపాడులో జరిగే ఆసరా సభకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి కాని, స్థానిక అధికారుల నుంచి కాని ఎటువంటి పిలుపు లేకపోవడంతో జంగా తీవ్ర అవమానంగా భావించారు. మాట మాత్రమైనా చెప్పకుండానే గ్రామంలో సభ ఎలా పెడతారని సర్పంచ్‌కు కూడా సమాచారం ఇవ్వరా అంటూ జంగా మండిపడ్డారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కాసు వర్గీయులు గ్రామంలోని సచివాలయం, పంచాయతీ కార్యాలయం, ప్రధాన కూడలిలో జంగా, సర్పంచ్ ఫొటోలు లేకుండా ఎమ్మెల్యే కాసు, ఇతర నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ సురేష్ జంగా తనయుడే. ఈ క్రమంలో సమాచారం అందుకున్న జంగా వర్గీయులు ఆ ఫ్లెక్సీలను తొలగించారు. తమకు తెలియకుండా తమ గ్రామంలో ఇష్టానుసారంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం ఏమిటి.. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చూస్తూ సహించబోమని ఫ్లెక్సీలు కట్టే వారిని హెచ్చరించారు. దీంతో కాసు, జంగా వర్గీయుల మధ్య తీవ్ర ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. ఫ్లెక్సీల తొలగింపుపై వైసీపీ నేతలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న దాచేపల్లి సీఐ సురేంద్రబాబు, ఎస్‌ఐ సంధ్యారాణి గామాలపాడు చేరుకుని బందోబస్తు నిర్వహించారు. గుంటూరు నుంచి ఆదివారం ఉదయమే స్వగ్రామం గామాలపాడు చేరుకున్న జంగా నేరుగా సచివాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఉన్న సీఐ సురేంద్రబాబు, ఇతర అధికారులతో మాట్లాడుతూ ఇక్కడ ఏమి జరుగుతుందని మీరందరు వచ్చారు.. ప్రశాంతంగా ఉన్న గ్రామాన్ని ఐక్యంగా ఉన్న గ్రామస్తులను ఎటువంటి తేడాలు లేకుండా చూడాలని కోరారు. అధికారులే కావాలని ఉత్సాహం చూపుతున్నారని జంగా ప్రశ్నించారు. అనవసరమైన చోట ఉత్సాహాన్ని చూపవద్దని, నేను ప్రభుత్వ విప్‌ను, ఎమ్మెల్సీని నాకు కార్యక్రమాలకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులకు లేదా.. తనను గౌరవించాల్సిన అవసరం ఉందా లేదా అంటూ అని ప్రశ్నించారు. అధికారం ఎప్పుడూ ఒకేవైపు ఉండదు.. ఎవరికిచ్చే మర్యాదలు వారికి ఇవ్వాలని అధికారులను మీరంతా వెళ్లిపోవచ్చు.. ఇక్కడ ఏమీ జరగడం లేదు.. అని జంగా అధికారులకు స్పష్టం చేశారు. ప్రొటోకాల్ పాటించని అధికారులపై తాను ఫిర్యాదు చేస్తానని తెలిపారు. అనంతరం గ్రామంలోని తన నివాసంలో జంగా సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రొటోకాల్ విషయంపై ఏర్పడిన ఉద్రిక్తత వాతావరణంతో అధికారులు ఎమ్మెల్యే కాసుతో మాట్లాడి ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేశారు.

బీసీలంటే లోకువా?

మేము బీసీలు కావడమే నేరమా.. బీసీలుగా ఉండటమే మా తప్పా.. ప్రజాప్రతినిధులుగా ఉన్న సొంత గ్రామంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు మమ్మల్ని ఆహ్వానించరా.. గౌరవించరా.. బీసీలంటే అంత లోకువయ్యామా.. బడుగు బలహీన వర్గాలంటే మాకు ఎంతో అభిమానమని చెప్పడమే తప్ప ఆచరణలో మాత్రం కనిపించడం లేదు.. అంటూ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, గామాలపాడు సర్పంచ్ జంగా సురేష్ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక నాయకుడిగా, రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీగా ఉన్న తనకు స్వగ్రామంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమానికే చెప్పకుండా ఎమ్మెల్యే కాసు ఎలా వస్తారని జంగా కృష్ణమూర్తి మండిపడ్డారు. ఎమ్మెల్యే పదవి కన్నా ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ అయిన తన పదవి పెద్దదే అయినా అధికారుల నుంచి నేతల వరకు బీసీలంటే చిన్నచూపు అని తెలిపారు.

దొరల పాలన సాగదు

- గురజాలకు ఎమ్మెల్యే కాసు చేసిందేమీలేదు
- అధికారం, డబ్బు, దోపిడీ శాశ్వతంగా ఉండదు
- ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి ఆరోపణ

గురజాలలో అంబేద్కర్ రాజ్యాంగం కొనసాగడం లేదు.. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రాజ్యాంగం నడుస్తుంది.. దొరల పాలన నడుస్తుంది.. ఇది ఎంతోకాలం సాగదు.. దీనికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.. అని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి ఎమ్మెల్యే కాసుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం గామాలపాడులో జంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమానికి తననుగాని, సర్పంచ్‌కి గాని సమాచారం ఇవ్వలేదన్నారు. ప్రజాప్రతినిధులుగా తమను గౌరవించడం లేదని మండిపడ్డారు. అధికారం, డబ్బులు, దోపిడీ శాశ్వతం కాదని, అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇష్టారాజ్యంగా చేసుకుంటూ పోతే బలహీనవర్గాల ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఎమ్మెల్యే కాసుపై నిప్పులు చెరిగారు. ఎమ్మెల్సీ అయిన తనను, సర్పంచ్ అయిన తన కుమారుడికిగాని మాటమాత్రమైనా చెప్పకుండానే అధికారులు తమ స్వగ్రామంలో కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గామాలపాడు వాసిగా గుర్తించి ఆహ్వానించాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. బడుగు బలహీనవర్గాలను వేధించడం, ఇబ్బందులు పెట్టడమే ధ్యేయమా, అవమానించడమే మీ లక్ష్యమా అని ప్రశ్నించారు. నిన్న గాక మొన్న గురజాలకి చెందిన కౌన్సిలర్ భర్త మహంకాళి నీలంరాజును బెదిరించడం, స్వామిమాలలో ఉన్నా మాచవరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టించారన్నారు. గతంలో కూడా భట్రుపాలెం, శ్రీనగర్ గ్రామాలకు చెందిన ఎస్సీ ఎస్టీలైన ప్రజాప్రతినిధులను ఇబ్బంది పెట్టారని విమర్శించారు. గ్రామాల్లో చిచ్చుపెట్టి, మద్యం పోసి, డబ్బులిచ్చి గ్రూపులను ఏర్పాటు చేస్తున్నారని ఇది ఎంతమాత్రం తగదన్నారు. కోట్ల రూపాయలతో గురజాల అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే కాసు చెబుతున్నారని కానీ ఆయన చేసింది ఏమీలేదని జంగా స్పష్టం చేశారు. 70 ఏళ్లుగా పిడుగురాళ్లకి నీళ్లు లేకపోతే తాను తెచ్చానని చెబుతున్నారని కాని ఎప్పుడు.. ఎక్కడ తెచ్చారని కాసును ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గోవిందాపురం నుంచి రూ.37 కోట్లతో కృష్ణా జలాలను పిడుగురాళ్లకు తీసుకొచ్చానని జంగా తెలిపారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్రం నుంచి తీసుకొచ్చిన నిధులతో చేపట్టిన కార్యక్రమాలన్నింటినీ తాను చేసినట్లు కాసు చెప్పుకుంటున్నారని విమర్శించారు. సమావేశంలో సర్పంచ్ జంగా సురేష్, మాజీ జడ్పీటీసీ భూషణం చెన్నయ్య, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మాశెట్టి పుల్లారావు, 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షరీఫ్, మాజీ ఎంపీటీసీ జక్కా జానకిరామయ్య తదితరులున్నారు.


గామాలపాడు గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ సురేంద్ర బాబు తదితరులు

బొల్లా అహంకారి, డబ్బు గర్వం

- ఎమ్మెల్యే ధోరణితోనే వైసీపీని వీడుతున్నా
- పార్టీకి రాజీనామా ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ: ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పదవి, డబ్బు గర్వంతో రాజకీయాలు చేస్తున్నారు. ఓట్లు వేసిన ప్రజలను అవమానిస్తున్నారు.. ఎమ్మెల్యే బొల్లా అహంకార ధోరణితోనే వైసీపీని వీడుతున్నాను.. అని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వైసీపీకి రాజీనామా చేశారు. బొల్లా వ్యవహార శైలి వినుకొండలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన పది మందికి భిన్నంగా ఉందని, దౌర్జన్యాలు, అరాచకాలు, అహంకారంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పట్టణంలోని కేజీఎల్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన తన రాజీనామాను ప్రకటించారు. తొలుత గుర్రం జాషువా, పులుపుల వెంకటశివయ్య, మక్కెన చినరామయ్యల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో మక్కెన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై, వైసీపీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. డాక్టర్ రాజశేఖరరెడ్డి మీద అభిమానంతో జగన్‌ను సీఎం చేసేందుకు 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను వీడి వైసీపీలోకి చేరినట్లు తెలిపారు. పదవులు, అధికారం కోరుకోలేదని, గౌరవం మాత్రమే కోరుకున్నానని, కానీ అది లేకపోగా వ్యక్తిగతంగా నష్టం చేశారన్నారు. గతంలో వేల్పూరులో ఎంపీ శ్రీకృష్ణదేవరాయుల సమక్షంలోనే గడిపూడి నరేంద్ర అనే రైతును ఎమ్మెల్యే చెప్పుతో కొట్టబోయారన్నారు. గతంలో నన్నపనేని సుధ భర్త డాక్టర్ లతీఫ్‌రెడ్డిపైన, ఇటీవల వినుకొండలో అంగన్‌వాడీలపై బొల్లా ప్రవర్తించిన తీరు బాధ వేసిందని, ఇవన్నీ ఆయన అహంకారానికి నిదర్శమన్నారు. బొల్లాపల్లిలో ఏర్పాటు కావాల్సిన ఆశ్రమ పాఠశాల శ్రీశైలం ప్రాంతానికి తరలివెళ్లిందన్నారు. ఇజ్రాయిల్ టెక్నాలజీతో వెంకుపాలెం సమీపంలో ఏర్పాటు కావాల్సిన పథకం సత్తెనపల్లికి పోయిందన్నారు. ఐదు డ్రిప్ ఇరిగేషన్ స్కీమ్‌లకు అనుమతి వచ్చినా పనులు నిలిచిపోయాయని, వీటికి ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. తనకు కేటాయించిన ఎన్ఎస్‌పీ క్వార్టర్స్‌ను కూల్చివేయవద్దని స్వయంగా ఎమ్మెల్యేకు తెలిపినా రాత్రికి రాత్రే కూల్చివేయించారన్నారు. బొల్లా తీరుపై అధిష్ఠానానికి చెప్పానని, వినుకొండ ప్రాంతంలో డబ్బు పెట్టుకునే వారు లేకపోవడం వల్ల మళ్లీ టికెట్‌ను బ్రహ్మనాయుడుకే కేటాయిస్తున్నట్లు తెలిపారన్నారు. ఈ పరిస్థితుల్లో బొల్లాతో కలిసి వెళ్లలేనని అధిష్ఠానానికి తేల్చిచెప్పినట్లు మక్కెన తెలిపారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు అనుమతులు, నూజెండ్లకు వెళ్లే దారిలో అండర్‌పాస్ బ్రిడ్జి, సొంత నిధులతో రోడ్ల మరమ్మతులు చేయించిన శ్రీకృష్ణదేవరాయులకు వైసీపీ సీటు ఇవ్వలేమని చెప్పడం బాదేసిందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసేందుకు ఇక్కడే ఉంటానని, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు అభీష్టం మేరకు త్వరలో రాజకీయ కార్యాచరణను ప్రకటిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వరికపూడిశెల సాధన సమితి నాయకుడు డి.రమణారావు, తుమ్మా వెంకటరెడ్డి, గుత్తా కోటేశ్వరరావు, అనుముల ప్రసాద్, కౌన్సిలర్ నన్నేసా, సూర్యానాయక్, ఎలిశెట్టి నరసింహారావు, గుడివాడ చినగుర్నాథం, ఎ.వినయ్‌కుమార్, గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, హాజరైన అనుచరులు

మామూలుగానే.. రిజిస్ట్రేషన్లు

- పేరుకే ఉచితం.. మామూళ్లు ఇష్టారాజ్యం
- పట్టాల రిజిస్ట్రేషన్‌లో రైటర్లు, వైసీపీ నేతల చేతివాటం


అయ్యప్పనగర్ పునరావాస కేంద్రం ఏరియల్ వ్యూ

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 4: ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ అవినీతిమయంగా మారింది. ప్రభుత్వం ఓ పక్క ఉచిత రిజిస్ట్రేషన్ అని చెబుతున్నా క్షేత్రస్థాయిలో కొందరు వైసీపీ నేతలు లబ్ధిదారుల నుంచి వేలకు వేలు గుంజుతున్నారు. పులిచింతల ప్రాజెక్టు పరిధిలో నిర్వాసితులకు 2005లో 12 పునరావాస కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పదేళ్ల అనుభవ హక్కు తర్వాత పట్టాదారులకు రిజిస్ట్రేషన్ హక్కును ప్రభుత్వం ఇటీవల జీవో 587 ద్వారా కల్పించింది. రెడ్డిగూడెం, రాజుపాలెం, చౌటపాపాయపాలెం, మాచాయపాలెం, అయ్యప్పనగర్, న్యూవెల్లంపల్లి, కొండమోడు, వేమవరంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లోని సుమారు ఐదున్నర వేలమందికి ఇల్లు, స్థలాలను ఉచితంగా రిజిస్ట్రేషన్, యూజర్ చార్జీలు లేకుండా చేసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. సత్తెనపల్లి, పిడుగురాళ్ల రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా తగు ఏర్పాట్లను కూడా ప్రభుత్వం కల్పించింది. దీంతో పిడుగురాళ్లలో కొందరు డాక్యుమెంట్ రైటర్లు పులిచింతల ప్రాజెక్టు కార్యాలయం ద్వారా నిర్వాసితుల జాబితా సంపాదించి వారికి ఫోన్లు చేసి రిజిస్ట్రేషన్ చేస్తున్నామని ప్రచారం చేశారు. తీరా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక ఒక్కొక్కరి వద్ద మూడు నుంచి ఐదు వేల వరకు వసూలు చేశారు. కొందరు అధికార పార్టీ నాయకుల అనుచరులు కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోండంటూ నిర్వాసితులకు చెప్తూ వసూలు చేస్తున్నారు. వాస్తవానికి స్టాంపులు, డాక్యుమెంట్ తయారీ ఖర్చుల వరకే తీసుకోవాలి. కానీ అధికారుల పేర్లు చెప్పి నిర్వాసితుల వద్ద వేలకు వేలు ముక్కుపిండి వసూలు చేస్తుండటం చర్చనీయాంశమైంది. ప్లాట్ల రిజిస్ట్రేషన్లన్నీ ఒకరిద్దరి చేతుల మీదగానే జరుగుతున్నాయని కొందరు డాక్యుమెంట్ రైటర్లు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

రిజిస్ట్రేషన్ ఉచితమే

పులిచింతల ప్రాజెక్టు పునరావాస కేంద్రాల్లోని పట్టాదారులకు రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం ఉచితంగా కల్పించింది. ఇందుకు కార్యాలయంలో ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. నగదు వసూలుకు తమ కార్యాలయానికి సంబంధం లేదు.

- ఆళ్ల తీర్థరాజ్యలక్ష్మి, సబ్‌రిజిస్ట్రార్

కులగణనతో బీసీలకు మోసం


- కక్షకట్టి బీసీ నేతలను జైల్లో పెట్టిన జగన్
- జయహో బీసీ సభలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర
- టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు అధిక ప్రాధాన్యం : జీవీ

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 4: ఎన్నికలకు ముందు కులగణన అంటూ ఓటీపీలతో బీసీలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద న్యాయవాది సైదారావు అధ్యక్షతన ఆదివారం జయహో బీసీ సభ జరిగింది. తొలుత జ్యోతిరావుపూలే చిత్రపటానికి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో జయహో బీసీ కరపత్రాలను విడుదల చేసి కొల్లు రవీంద్ర ప్రసంగించారు. రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసి గుర్తింపు ఇచ్చిన ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా అడుగడుగునా అవమానాలకు గురి చేస్తూ అణగదొక్కిన ఘనుడు సీఎం జగన్ అని విమర్శించారు. రాజ్యాంగం రాష్ట్రంలో బీసీలకు కల్పించిన 16,800 పదవులను తగ్గించిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదన్నారు. బీసీలకు సబ్సిడీ రుణాలు, విదేశీ విద్య అమలుచేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతోపాటు తనపై కేసులు పెట్టి 54 రోజులు జైల్లో పెట్టారన్నారు. యనమల రామకృష్ణుడిపై ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టారన్నారు. కేసులు పెట్టి రాష్ట్రంలోని బీసీలను అణగదొక్కేందుకు పథక రచన చేశారన్నారు. 2500మంది బీసీలపై తప్పుడు కేసులు పెట్టి 75మంది బీసీలను హతమార్చారన్నారు. బీసీలకు నిధులు, విధులు, కుర్చీలేని కార్పొరేషన్ చైర్మన్ పదవులు కట్టబెట్టారన్నారు. రాష్ట్రంలో ఏ పని జరగాలన్నా ఇటు విజయసాయిరెడ్డి, అటు వైవీ సుబ్బారెడ్డి, సజ్జల అనుమతులు కావాలన్నారు. ఎన్టీఆర్ హయాంలో బీసీలకు స్థానిక సంస్థలతో పాటు నామినేటెడ్ పదవుల్లో 24శాతం రిజర్వేషన్ కల్పిస్తే, చంద్రబాబు అధికారంలోకి వచ్చినతర్వాత దానిని 34శాతం చేశారన్నారు. రాష్ట్రంలో ప్రతి బీసీ కుటుంబాన్ని అభివృద్ధి చేయాలన్నదే టీడీపీ లక్ష్యమన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ బీసీలకు ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా గుర్తింపు ఇచ్చి వారికి మంత్రి పదవులు ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. రానున్నది టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వమని, బీసీలకు రక్షణచట్టంద్వారా కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల గంగాధర్, బీమవరపు సుబ్బారావు, జనసేన సమన్వయకర్త కొంజేటి నాగశ్రీనురాయల్, దుమ్మాలపాటి మల్లికార్జున్, టీడీపీ పట్టణఅధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


జయహో బీసీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రవీంద్ర, ఆంజనేయులు తదితరులు

ఈ నెలా.. వేతలే

- ఐదో తేదీ వచ్చినా అందని వేతనం
- గత నెల 24న పెట్టిన బిల్లులకే జీతాలు
- దయనీయంగా ప్రభుత్వ పెన్షనర్ల కష్టాలు
- నాలుగేళ్లుగా జీతాల జాప్యంతో ఉద్యోగుల పాట్లు
- ఎన్నికలు సమీపిస్తున్నా మార్పులేని ప్రభుత్వ వైఖరి



గుంటూరు ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వేతన వెతలకు విముక్తి కలగడంలేదు. ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ఈ నెలలో జీతాలకు జాప్యం ఉండదు.. పరిస్థితులు మార తాయి.. అని ఆశించిన ఉద్యోగులకు నిరాశే ఎదురైంది. 5వ తేదీ వచ్చి నా అనేక విభాగాల ఉద్యోగులకు జీతాలు అందలేదు. ఇక పెన్షనర్ల పరి స్థితి దయనీయంగా ఉంది. నాలుగేళ్లుగా ఏదైతే పరిస్థితి ఉందో అదే పరిస్థితి ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం వేతన జీవుల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ఒకటో తేదీ పోయి ఐదు రోజులు కావస్తు న్నా ఉమ్మడి గుంటూరు జిల్లాలో సగం మంది ఉద్యోగులకు కూడా కష్టార్జితం దక్కలేదు. తొలివిడతగా కిందటి నెల 24వ తేదీ నాటికి వేతన బిల్లులు పెట్టుకున్న ఒకటి అరా బిల్లులకు మాత్రమే వేతనాలు వచ్చినట్లు తెలుస్తోంది. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగుల వేతన బిల్లులను డ్రాయింగ్ అధికారులు ప్రతి నెలా 25వ తేదీ, ఆ తర్వాత మాత్రమే ట్రెజరీ కార్యాలయాలకు పంపుతారు. అతి కొద్దిమంది మాత్రమే 25వ తేదీలోపు బిల్లులు పెట్టుకుంటారు. అలా పెట్టుకున్న ఒకటి రెండు విభాగాల ఉద్యోగులకు మాత్రమే వేతనాలు ఇచ్చి ప్రభుత్వం మిగిలినవారి వేతనా లను పెండింగ్ పెట్టింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి విశ్రాం త ఉద్యోగుల పరిస్థితి చాలా దారుణంగా మారింది. రెండేళ్ల నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా వీరికి తోడయ్యారు. ప్రతి నెలా పదో తేదీ దాటకుండా వీరికి పెన్షన్లు, వేతనాలు దక్కడం లేదు. ఆర్బీఐ వద్ద ప్రతి మంగళవారం జరిగే బాండ్ల వేలం, రుణ పరిమితిపైనే వీరి వేత నాలు ఆధారపడ్డాయా అన్నట్లుగా పరిస్థితి తయారైంది. గుంటూరు, ప ల్నాడు, బాపట్ల జిల్లాల్లో 40శాతం మంది ఉపాధ్యాయులకు కూడా వేతనాలు దక్కలేదు. ఉమ్మడిజిల్లాలో ఇప్పటివరకూ ఒక్కరికి కూడా పెన్షన్ అందలేదు. ఆర్థికశాఖ కేంద్రకార్యాలయం చుట్టూ తిరిగితే తప్ప తమకు వేతనాలు, పెన్షన్లు పడే పరిస్థితిలేదని ఉపాధ్యాయులు, పెన్షనర్లు వాపోతున్నారు.

పోలీసు, సచివాలయ ఉద్యోగులకే..

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో దాదాపు 70 ప్రభుత్వ విభాగాలకు సంబంధించి 50 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. వారికి తోడుగా వైసీపీ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన సచివాలయ ఉద్యోగులు మరో 12 వేల మంది వరకూ ఉన్నారు. కార్యకలాపాల నిర్వహణలో కీలకమైన అన్ని ప్రభుత్వ శాఖలను వదిలేసి ప్రభుత్వం పోలీసు, సచివాలయ, వైద్య, న్యాయ శాఖల ఉద్యోగులకు మాత్రమే తొలివారం వేతనాలు అందుతున్నాయి. ప్రధానంగా పోలీసు, సచివాలయ ఉద్యోగులే ప్రభుత్వ ప్రాధాన్యంగా కనిపిస్తోంది. రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చే రెవెన్యూ, రిజిస్ట్రేషన్, రవాణా శాఖలు సహా అన్ని ప్రాధాన్య శాఖల ఉద్యోగులకు మాత్రం రెండో వారంలోనో, పదో తేదీ తర్వాతనో ప్రభుత్వం వేతనాలు ఇస్తోంది.

రెండు నెలల తర్వాతైనా పరిస్థితి మారుతుందా?

మరో రెండు నెలల్లో వచ్చే ఎన్నికలపైనే వేతన జీవులు ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారితే తమ కష్టాలు తీరుతాయని వారు బలంగా నమ్ముతున్నారు. అయితే రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం, తిరిగి కోలుకోలేనంతగా అప్పుల ఊబిలో ముంచేసిన ప్రస్తుత ప్రభుత్వ విధానాల నుంచి రాష్ట్రం ఎప్పుడు బయటపడుతుంది అనేది సమాధానం లేని ప్రశ్న! రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిన పడేవరకూ ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ కష్టాలు తప్పకపోవచ్చన్న భావన కూడా వారిలో ఉంది.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

భారత్ - ఫ్రాన్స్ ద్వైపాక్షిక సంబంధాలు

ఇద్దరు వ్యక్తుల మధ్యే కాదు, రెండు దేశాల మధ్య మిత్రత్వం దీర్ఘకాలం కొనసాగాలంటే భావసారూప్యత ఎంతో అవసరం. విపత్కర కాలంలో ఒకరికి ఒకరు వెన్నుదన్నుగా నిలవడం మరీ ముఖ్యం. ఫ్రాన్స్-భారత్‌ల మధ్య సుదీర్ఘ స్నేహ సంబంధాలు ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి.

1980ల్లో మిరాజ్ యుద్ధ విమానాలను అందించడం మొదలు, 1982లో భారత్‌కు అణు ఇంధనాన్ని అందించాల్సిన అమెరికా సహకరించనప్పుడు, ఆ స్థానంలో ఫ్రాన్స్ భారత్‌కు అణు ఇంధన సరఫరా చేయడం వరకూ ఒక సహకార ధోరణి కనిపిస్తుంది. అనంతరం 1998లో భారత్ అణు పరీక్షలు జరిపినప్పుడు అమెరికా వంటి అగ్ర దేశాలన్నీ భారత్‌పై ఆంక్షలు విధించినా, ఫ్రాన్స్ మాత్రం ఆ పని చేయకుండా తన మిత్రత్వాన్ని చాటుకుంది.

ఇలాంటి సయోధ్య, స్నేహబంధం ఇటీవల మరోసారి రుజువైంది. తొలుత గత జులైలో ప్రధాని మోదీని ఫ్రాన్స్ తమ 'బాస్టిల్ డే' పరేడ్‌కు ఆహ్వానించగా, ఈయేటి గణతంత్ర దినోత్సవ ముఖ్యఅతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్‌ను భారత్ ఆహ్వానించింది. ఈ పర్యటనల సందర్భంగా అనేక కీలక ఒప్పందాలు కుదిరిన నేపథ్యంలో, ఇరుదేశాల మధ్య సుదీర్ఘ స్నేహబంధం, నేటి ప్రపంచ పరిస్థితుల్లో అది మరింత బలపడాల్సిన ఆవసరం, సవాళ్లు చర్చనీయమైనాయి.

● ఇండో-ఫ్రాన్స్ సుదీర్ఘ ద్వైపాక్షిక బంధం

బహుళ ధ్రువ ప్రపంచం దిశగా భావసారూప్యం: ఫ్రాన్స్-భారత్ రెండూ ఎంతో భావసారూప్యం గల దేశాలు. ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో అమెరికా, రష్యా కూటములపరంగా ప్రపంచం చీలిపోయిన సందర్భంలోనూ, భారతదేశం ఏ కూటమివైపు మొగ్గుచూపకుండా అలీన(నాన్ ఎలైన్‌మెంట్) ఉద్యమ స్ఫూర్తిని ప్రదర్శించింది. అదేవిధంగా ఫ్రాన్స్ అమెరికాకు మిత్ర దేశమే అయినా కూడా తటస్థ వైఖరినే అవలంభించింది. అదేవిధంగా ఇరాన్‌పై అమెరికా దాడి సమయంలోనూ, బ్రిటన్ వంటి పాశ్చాత్య దేశాలు అమెరికాకు సహకరించినా, ఫ్రాన్స్ మాత్రం ఇరాక్‌పై అమెరికా దాడిని వ్యతిరేకించింది. భారత్ కూడా ఇలాంటి దాడులను ఎప్పుడూ సమర్థించలేదు. ఇటీవల రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయిల్-హమాస్ యుద్ధ పరిస్థితుల్లో కూడా రెండు దేశాలూ ఏ దేశానికీ మద్దతుగా నిలువలేదు. యుద్ధ విరమణనే కోరాయి. దాడులను ఖండించాయి.

ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో రష్యా, చైనా ఒక కూటమిగా, అమెరికా, పాశ్చాత్య దేశాలు మరోవైపు మోహరిస్తూ ఉన్న నేపథ్యంలో భారత్-ఫ్రాన్స్ తటస్థ కూటమిగా బహుళ ధ్రువ ప్రపంచం ఆవిష్కారానికి ఆస్కారం ఉంది. గ్లోబల్ సౌత్‌కు భారత్ నేతృత్వం వహిస్తూ, యూరోపియన్ యూనియన్‌కు ఫ్రాన్స్ ప్రాతినిధ్యంతో రెండు శక్తులనూ సమన్వయం చేయడం ద్వారా ఒక తటస్థ బహుళ ధ్రువ ప్రపంచం వైపు పయనించవచ్చు.

వ్యూహాత్మక సంబంధాలు: తొలినుంచే రెండు దేశాల మధ్య ఉన్న సుహృద్భావ వాతావరణం 1998లో వీటిమధ్య 'స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్(వ్యూహాత్మక భాగస్వామ్య) ఒప్పందానికి దారితీసింది. రక్షణ, భద్రతా రంగాల్లో సహకారం, అంతరిక్ష పరిశోధనల పరంగా, పౌర అణు ఇంధనపరంగా సహకారం ఈ ఒప్పందంలోని కీలక అంశాలు. భారతదేశ భౌగోళిక వ్యూహాత్మకత దృష్ట్యా ఫ్రాన్స్ తన ఇండో పసిఫిక్ ప్రాంతమైన 'రీ యూనియన్ ఐలాండ్'లో భారత వాయుసేనకు స్థావరం ఇవ్వడమే కాక, 2020లో 'ఇండియన్ ఓషన్ కమిషన్'లో భారత్‌కు అబ్జర్వర్‌గా స్థానం దక్కడానికి ఫ్రాన్స్ సహకరించింది. తద్వారా భారత్‌కు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఎంతో వ్యూహాత్మక ప్రయోజనాలు చేకూరాయి.

అదేవిధంగా ఇండో పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత కార్యకలాపాలు, సమ్మిళిత ప్రయోజనాలు, పరస్పర సహకారానికిగానూ ఏర్పడిన 'ఇండియా-ఫ్రాన్స్-ఆస్ట్రేలియా ట్రై లేటరల్ డైలాగ్'లో ఈ రెండు దేశాలూ కీలకపాత్ర పోషిస్తున్నాయి.




భారత్-ఫ్రాన్స్ వ్యూహాత్మక ద్వైపాక్షిక సంబంధాల 25వ వార్షికోత్సవం సందర్భంగా తమ బంధాన్ని 2047 వరకూ పొడిగించుకొనేందుకు 'హొరిజన్ ఆఫ్ 2047 అగ్రిమెంట్' గత సంవత్సరం జరిగింది. దీంతో 1947లో భారత్-ఫ్రాన్స్ మధ్య ప్రారంభమైన దౌత్య సంబంధాలకు 2047 నాటికి వంద సంవత్సరాలు పూర్తవగా, 1998లో ఏర్పర్చుకున్న వ్యూహాత్మక సంబంధాలకు 50 ఏళ్లు పూర్తవుతాయి.

రాజకీయ మద్దతు: భారత్‌కు ఐక్యరాజ్యసమితి శాశ్వత సభ్యత్వం ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన తొలి శాశ్వత సభ్య దేశం ఫ్రాన్స్. అంతేకాక మిసైల్ టెక్నాలజీ కంట్రోల్ రిజీమ్(ఎంటీసీఆర్), వాస్సెనార్ అగ్రిమెంట్, ఆస్ట్రేలియా గ్రూప్‌లలో భారత ప్రాతినిధ్యానికి కూడా ఫ్రాన్స్ ఇతోధికంగా సహకరించింది. జమ్మూ కాశ్మీర్ అం శంలో ఫ్రాన్స్ భారత్‌కు మద్దతు ఇవ్వడమే కాదు, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని కూడా ఖండిస్తూ వస్తోంది. అంతేకాక చైనాకు దీటైన ప్రత్యామ్నాయ శక్తిగా భారత్‌కు తన మద్దతును తెలుపుతూ వస్తోంది.

ఆర్థిక సంబంధాలు: ఇరుదేశాల మధ్య ఇటీవలకాలంలో విస్తృతస్థాయిలో వాణిజ్యం జరుగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇరుదేశాల మధ్య 13.4 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగింది.

భారత్ నుంచి ఫ్రాన్స్‌కు ఏడు బిలియన్ డాలర్లపైగా ఎగుమతులు పెరిగాయి. అదేవిధంగా భారతదేశంలో ప్రత్యక్ష పెట్టుబడుల్లో 1.64 శాతం సమకూర్చుతూ భారత్‌లో విదేశీ పెట్టుబడులపరంగా ఫ్రాన్స్ 11వ స్థానంలో నిలిచింది. భారత్‌లో ఫ్రాన్స్‌కు చెందిన దాదాపు వెయ్యి సంస్థలు(ఎస్టాబ్లిష్‌మెంట్స్) 20 బిలియన్ డాలర్ల టర్నోవర్ కలిగి మూడు లక్షలమందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. అదేవిధంగా భారత్‌కు చెందిన 150 కంపెనీలు ఫ్రాన్స్‌లో ఏడువేలమందికి ఉపాధినిస్తున్నాయి. ఇండో-ఫ్రాన్స్ అడ్మినిస్ట్రేటివ్ ఎకనామిక్ అండ్ ట్రేడ్ కమిటీ(ఏఈటీసీ) ద్వారా భారత్-ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాల పెరుగుదలకు, వ్యాపార అవరోధాల పరిష్కారానికి కృషి జరుగుతోంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

(మిగతా రేపటి దిక్సూచి పేజీలో)

దిక్సూచి
DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

మౌర్య సామ్రాజ్యం



ఇండియన్ హిస్టరీ

భారతదేశంలో తొలిసారి గొప్ప పరిపాలనను అందించిన వారు మౌర్యులు. వీరు విశాల భారతదేశాన్ని ఆక్రమించారు. వాయువ్యంలో గ్రీకులను, మగధలో నంద వంశస్థులను నిర్మూలించారు. 'పాటలీపుత్రం' రాజధానిగా క్రీ.పూ.322 నుంచి క్రీ.పూ.185 వరకు పరిపాలించారు.

మౌర్యుల చరిత్రకు ఆధారాలు

మౌర్యుల చరిత్రకు అనేక సాహిత్య, పురావస్తు ఆధారాలతోపాటు గ్రీకు, చైనా చరిత్రకారుల రచనలు లభించాయి.

కౌటిల్యుని అర్థశాస్త్రం: సంస్కృతంలో రాసిన ఈ గ్రంథం మౌర్యుల పరిపాలన విధానాలు, చంద్రగుప్తుని రాజకీయ, రాజనీతి సిద్ధాంతాలను తెలియజేస్తుంది.

విశాఖదత్తుని ముద్రారాక్షసం: నందవంశంలోని చివరి రాజైన ధననందున్ని చంద్రగుప్త మౌర్యుడు ఓడించి, వారి రాజ్యాన్ని ఆక్రమించుకున్నట్లు రాసి ఉంది. ఈ గ్రంథంలో విశాఖదత్తుడు మౌర్యులను 'హీనకులస్థులు'గా పేర్కొన్నాడు.

హేమచంద్రుని పరిశిష్టపర్వన్: ఈ గ్రంథంలో చంద్రగుప్త మౌర్యుడు జైనమతంలోని 'దిగంబర'శాఖను తన గురువైన 'బద్రబాహు' ద్వారా స్వీకరించిన విధానం రాసి ఉంది.

విదేశీ గ్రంథాలు: గ్రీకు రాయబారి మెగస్తనీస్ తన 'ఇండికా' గ్రంథంలో పాటలీపుత్రంలోని పరిపాలన, సమాజంలోని మతం, స్త్రీల దుస్థితి, ఆర్థిక రంగాల గురించి రాశాడు. చైనా యాత్రికుడు ఫాహియాన్ గుప్తు ల కాలంలో భారతదేశం సందర్శించినప్పటికీ మౌర్యుల కాలం నాటి సామాజిక విధానాన్నే వివరించాడు.

అశోకుని శిలాశాసనాలు: భారతదేశంలో తొలిసారిగా అశోకుడు అనేక శాసనాలు వేయించాడు. బ్రాహ్మి లిపి, పాళి భాషలో అనేక శాసనాలున్నప్పటికీ, సంస్కృతంలో మాత్రం చెక్కించలేదు. దీనికి ముఖ్య కారణం ఆ కాలంనాటి ప్రజల వాడుక భాష 'పాళి' కావడం. సార్‌నాథ్, మస్కి, రుమిండై, కౌశాంబి, రాయలసీమలోని కర్నూలులో ఎర్రగుడి, రాజుల మందగిరి వద్ద అశోకుని శాసనాలు లభించాయి.

మౌర్యుల రాజకీయ చరిత్ర(322 - 185 క్రీ.పూ.)

మౌర్య వంశస్థాపకుడు చంద్రగుప్త మౌర్యుడు. అలెగ్జాండర్ సేనాని సెల్యూకస్ నికేటర్‌ను ఓడించి ప్రస్తుత ఆఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్- ఇరాన్ సరిహద్దులను ఆక్రమించాడు. గ్రీకులు చంద్రగుప్త మౌర్యున్ని 'యాండ్రకోటస్'గా పేర్కొన్నారు. చంద్రగుప్త మౌర్యుడు గ్రీకులతో వివాహ సంబంధాలు కుదుర్చుకున్నాడు. అందుకు ప్రతిఫలంగా వారి నుంచి అరకోషియా(కాందహార్), కాబూల్, గెడోసియా(బెలూచిస్థాన్), మీరట్ మొదలైన ప్రాంతాలను కైవసం చేసుకున్నాడు. చివరికి చంద్రగుప్త మౌర్యుడు జైనమతం స్వీకరించాడు. కర్ణాటకలోని మైసూర్ వద్ద గల చంద్రగిరి పర్వతంపై 'సల్లేఖన' వ్రతం(ఉపవాస దీక్ష) చేపట్టి మరణించినట్లు జైన గ్రంథాల్లో ఉంది.

బిందుసారుడు(297- 273 క్రీ.పూ.): చంద్రగుప్త మౌర్యుని కుమారుడు. ఇతనికి 'సింహసేనుడు' 'అమిత్రఘాత' అనే బిరుదులున్నాయి. బిందుసారునికి సిరియా రాజు మొదటి అందయోకస్‌తో మంచి స్నేహం ఉండేది. స్నేహానికి గుర్తుగా ద్రాక్షరసాన్ని, అత్తిపండ్లను బిందుసారునికి కానుకలుగా పంపేవాడు. తారాచంద్ అనే బౌద్ధటిబెట్ చరిత్రకారుడు బిందుసారుడిని రెండు సముద్రాల మధ్య ప్రాంతాన్ని పాలించినవాడు అని తన రచనల్లో పేర్కొన్నాడు. బిందుసారుని కాలంలో తక్షశిల రాష్ట్రంలో సైనిక తిరుగుబాటు జరిగింది. దీనిని యువరాజైన అశోకుడు కఠినంగా అణచివేశాడు. బిందుసారుడు చివరి దశలో 'అజీవకమతం'ను స్వీకరించాడు. బిందుసారుడు నాగార్జున గుహలో మరణించినట్లు, అందుకే వాటిని అజీవక మతస్థులకు అంకితం చేసినట్లు కొన్ని గ్రంథాల్లో రాసి ఉంది.

అశోకుడు(273 - 232 క్రీ.పూ.): బిందుసారుని కుమారుడు అశోకుడు. తన పట్టాభిషేకం సందర్భంగా రాజ్యంలో ఉన్న యుద్ధఖైదీలను విడుదల చేశాడు. భారతదేశంలో శాసనాలు ముద్రించిన తొలిరాజు. బ్రాహ్మిలిపిలో పాళి భాషలో గల అశోకుని శాసనాలను జర్మనీకి చెందిన జేమ్స్‌ప్రిన్సెస్ అనే చరిత్రకారుడు తొలిసారిగా గుర్తించి, చదివాడు. అశోకుడు వాయువ్య ప్రాంతంలో సెబాష్‌ఘర్, మన్సార శాసనాలు; ఆఫ్ఘానిస్థాన్‌లో ఖంతహాల్ శాసనం చెక్కించాడు. సిరియా రాజు రెండో ఆంటియోకస్‌తో, ఈజిప్ట్‌రాజు ఫిలడేల్ఫస్‌తో, మాసిడోనియా రాజు ఆంటియోగానస్‌తో, సైరస్‌రాజు మాగాస్‌తో, ఎపిరస్ రాజు అలెగ్జాండర్‌తో మంచి స్నేహసంబంధాలు కొనసాగించాడు.

సామ్రాజ్యకాంక్షతో కళింగపై దండయాత్ర చేశాడు. ఈ యుద్ధం తరవాత అశోకుడు బౌద్ధ దీక్షను స్వీకరించాడు. 3వ బౌద్ధమత సమావేశాన్ని పాటలీపుత్రలో నిర్వహించాడు. 'దేవానాంప్రియ', 'ప్రియదాసి' అనే బిరుదులు అశోకునికి ఉన్నాయి. నైతిక సూత్రాలు ప్రచారం చేయడానికి 18 మంది దర్మమహా మాత్రులను అశోకుడు నియమించారు. దయ, దాతృత్వం, సంక్షేమం ముఖ్యమైన లక్షణాలు 'ధర్మ' సూత్రంలో పేర్కొన్నారు. 232 క్రీ.పూ.లో అశోకుడు మరణించాడు.

చివరి మౌర్యరాజులు: అశోకుడి మరణం తరవాత కుణాలుడు రాజ్యానికి వచ్చాడు. ఈ కాలంలో మౌర్య సామ్రాజ్యం రెండుగా చీలిపోయింది. తరవాత వచ్చిన రాజులు దాదాపు 50 సంవత్సరాలు పాలించారు. చివరి మౌర్య రాజైన బృహద్రదుడిని, అతని సేనాని పుష్యమిత్రుడు వధించి మగధను ఆక్రమించి శుంగ వంశాన్ని స్థాపించాడు.

సమాజం పరిస్థితులు: మౌర్యుల కాలంలో బానిస వ్యవస్థ లేదని మెగస్తనీస్, ఉండేదని కౌటిల్యుడు తమ రచనల్లో పేర్కొన్నారు. బహుభార్యత్వం, బాల్య వివాహాలు, సతీసహగమనం మౌర్యుల పాలనలో సాధారణం. వ్యభిచార వృత్తి ఉండేదని డియోడోరస్ రాశాడు. 8 రకాల వివాహాలు జరిగేవని, వీటితో పాటు స్వయం వరం, రాక్షస వివాహం, గాంధర్వ వివాహం కూడా ఉండేవని చరిత్రకారులు పేర్కొన్నారు. మౌర్యులు మద్యపాన ప్రియులు అని మెగస్తనీస్ వ్యాఖ్యానించాడు. ప్రజలు గోధుమ, బార్లీని ప్రధాన ఆహారంగా తీసుకునేవారు. నూలు, పట్టు, వస్త్రాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. బంగారం, వెండి, రత్నాలు కలిగిన ఆభరణాలు ధరించేవారు. జూదం ఆడటం, జంతువులతో పోరాటాలు, మల్ల యుద్ధాలు, ఉత్సవాలు వీరి వినోదాలు.



డాక్టర్ ఐ.నీలా
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రభుత్వ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, సూర్యాపేట

భారతదేశ చరిత్రలో ఏ రాజవంశానికి లేని కేంద్రీకృత పాలన వ్యవస్థ మౌర్యుల కాలంలో కన్పిస్తుంది. అశోకుడు పాటలీపుత్రం కేంద్రంగా ఉంటూ మారుమూల గ్రామమైన సిద్ధాపురంలోని విషయాలను తెలుసుకునేవాడు. మౌర్యులకున్న విస్తృత అధికార యంత్రాంగం చరిత్రలో ఏ రాజవంశంలోనూ కన్పించదు. నిరపేక్ష, నిరంకుశ రాజరికం అధికారాలు చెలాయించేవారు. దేశచరిత్రలోనే తొలిసారిగా శ్రేయోరాజ్యం స్థాపించారు. వీరి పాలనలో మూడు దశలు ప్రధానంగా కన్పిస్తాయి అవి..కేంద్ర ప్రభుత్వం, ప్రాంతీయ ప్రభుత్వం, స్థానిక పాలన.

కేంద్ర ప్రభుత్వం: రాజుకు సహాయం చేయడానికి మంత్రిపరిషత్ ఉండేదని మెగస్తనీస్ తన ఇండికా గ్రంథంలో రాశాడు. పాలనలో ఆయా విభాగాలను పర్యవేక్షించడానికి 32 మంది అధ్యక్షులు ఉండేవారు. వీరిలో 'సన్నిదాత', 'కోశాధికారి', 'సంహర్తి' పన్నులు వసూలు చేసే అధికారులు.

ప్రాంతీయ పాలన: పాలన సౌలభ్యం కోసం మౌర్యులు తమ సామ్రాజ్యాన్ని నాలుగు ప్రాంతాలుగా, ఆహారాలుగా, రాష్ట్రాలుగా విభజించారు. తూర్పు ప్రాంతానికి తోసలి; పశ్చిమ ప్రాంతానికి తక్షశిల; మధ్య ప్రాంతానికి ఉజ్జయిని, అవంతి; దక్షిణ ప్రాంతానికి సువర్ణగిరి ముఖ్యస్థానాలు. రాష్ట్రాలకు పాలనాధికారులను కుమార మాత్యులు అని అంటారు. వీరికి సహాయంగా రజుక, యుక్త అనే అధికారులు ఉంటారు. 'పురుష' అనే అధికారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమాచారం అందించేవారు.

మౌర్యుల పరిపాలన విధానం

స్థానిక పాలన: స్థల లేదా స్థానిక ప్రధాన పాలన విభాగాలు. వీటి పాలనను స్థానిక, గ్రామిక నిర్వహించేవారు. పాలనలో చివరి భాగం గ్రామం. గ్రామణి పాలన బాధ్యతలు నిర్వహిస్తారు.

నగర పాలన: మెగస్తనీస్ తన ఇండికాలో 30 మంది సభ్యులతో 6 కమిటీలను పురపాలక సంఘం నిర్వహించినట్లు రాశాడు.

సైనిక పాలన: మెగస్తనీస్ రచనల్లో పాటలీపుత్ర నగర పాలన గురించి ఉంది. ఒక్కో కమిటీతో ఐదుగురు సభ్యుల చొప్పున సైనిక పాలన బాధ్యతలు నిర్వహించారు. కాల్బలం, సైనిక జీతభత్యాల నిర్వహణ. అశ్వికదళం, గజదళం, రథబలం, నౌకాదళం ముఖ్యమైన విభాగాలు. సైనిక చికిత్సలకు అంబులెన్స్ వ్యవస్థ ఉండేదని చాణక్యుడు రాశాడు. సైన్యంలో ఆరు లక్షల కాల్బలం, 30 వేల అశ్వదళం, 9 వేల గజబలం ఉండేదని 'ప్లేని' తన నేచురల్ హిస్టరీ గ్రంథంలో రాశాడు.

అమెరికాలో 'కాండిడా ఆరిస్' కలకలం

వాషింగ్టన్, ఫిబ్రవరి 4: అగ్రరాజ్యం అమెరికాను 'కాండిడా ఆరిస్' అనే ప్రాణాంతక ఫంగల్ ఇన్ఫెక్షన్ కలవరపెడుతోంది. వాషింగ్టన్‌లో నెల రోజు ల వ్యవధిలోనే నలుగురు వ్యక్తులకు ఈ ఇన్ఫెక్షన్ సోకింది. ఈ అరుదైన ఫంగస్ అత్యంత హానికరమని, దీని బారినపడిన వారిలో మరణాల రేటు అధికంగా ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువున్నవారికి ఇది తొందరగా సోకుతుందని, పలు ప్రభావవంతమైన యాంటీ ఫంగల్ ఔషధాలు సైతం దీని చికిత్సలో ప్రభావం చూపలేకపోతున్నాయని చెబుతున్నారు. దీనికి సులభంగా వ్యాప్తిచెందే లక్షణాలు ఉండడంతో.. చాలా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

మెట్రోలో అసభ్యంగా ప్రవర్తిస్తే రూ. 10 వేల ఫైన్

బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మహిళా ప్రయాణికులపై లైంగిక వేధింపులను నియంత్రించేందుకు బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎంఆర్‌సీఎల్) ప్రత్యేక చర్యలకు సిద్ధమైంది. లైంగిక వేధింపులకు పాల్పడితే రూ.10 వేలు జరిమానా విధించనున్నారు. గతంలో రూ.500 ఉన్న జరిమానా మొత్తాన్ని ఏకంగా రూ.10 వేలకు పెంచారు. ఇటీవల ఓ మహిళ పట్ల ఓ వ్యక్తి అనుచితంగా ప్రవర్తించిన అంశం వెలుగులోకి వచ్చింది. దీంతో మెట్రో రైలు, స్టేషన్లలో అనుచితంగా ప్రవర్తించేవారికి తగిన గుణపాఠం చెప్పాలనే ఈ నిర్ణయం తీసుకున్నారు.

సాగర్ స్వాధీనంపై మళ్లీ కేంద్రం సమీక్ష

- 16న రెండు రాష్ట్రాల సీఎస్‌లతో భేటీ
- ప్రాజెక్టుల అప్పగింతపై తుది నిర్ణయానికి చాన్సు

అమరావతి, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిపై ఆంధ్ర, తెలంగాణ నిర్మించిన ప్రాజెక్టులను.. ప్రధానంగా నాగార్జున సాగర్‌ను కృష్ణానదీ యాజమాన్య సంస్థ (కేఆర్‌ఎంబీ)కు కట్టబెట్టే దిశగా కేంద్రం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ నెల 16న సాగర్ ప్రస్తుత స్థితిపై రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో సమీక్ష నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు వారికి కేంద్ర జలశక్తి శాఖ సమాచారం పంపింది. అదే రోజు సాగర్ అప్పగింతపై తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. గతేడాది నవంబరు 29న అర్ధరాత్రి.. కొద్దిగంటల్లో తెలంగాణ ఎన్నికల పోలింగ్ ఉందనగా.. సాగర్‌ను ఏపీ పోలీసు బలగాలు ఆక్రమించుకోవడాన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకున్న సంగతి తెలిసిందే. డిసెంబరు 1నుంచి వరుసగా కేంద్ర హోం, జలశక్తి శాఖల కార్యదర్శులు అజయ్‌భల్లా, దేబర్షి ముఖర్జీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. సాగర్, శ్రీశైలం సహా కృష్ణా నదిపై రెండు రాష్ట్రాల అధీనంలోని ప్రాజెక్టులూ.. అవుట్‌లెట్‌లనూ అప్పగించాల్సిందేనని కేంద్రం ఇప్పటికే స్పష్టం చేసింది. అవి బోర్డు పరిధిలోకి వస్తే.. ఆటోమేటిగ్గా కేంద్ర భద్రతాబలగాల పహరాలోకి వెళ్లిపోతాయని చెబుతోంది. అయితే ఈ ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి ఇచ్చేందుకు తెలంగాణ అంగీకరించడం లేదు. ఆ రాష్ట్రం అప్పగిస్తేనే తామూ స్వాధీనపరుస్తామని ఏపీ మెలిక పెడుతోంది. ఈ నెల 1న హైదరాబాద్‌లోని కేఆర్‌ఎంబీ కార్యాలయంలో చైర్మన్ శివనందన్‌కుమార్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో.. తెలంగాణ తన వాదనను పునరుద్ఘాటించింది. గత నెల 17న కేంద్ర హోం, జలశక్తి కార్యదర్శుల సమక్షంలో జరిగిన సమావేశం మినిట్స్‌ను సవరించాలని పట్టుబట్టింది. మరోవైపు.. ఒకటో తేదీనాటి సమావేశం మినిట్స్‌ను బోర్డు శుక్రవారం విడుదల చేసింది. ఈ మినిట్స్‌లో ప్రాజెక్టుల అప్పగింతపై తెలంగాణ పితలాటకం పెట్టడంపై కేంద్రం అసహనం వ్యక్తం చేస్తోంది. దీంతో.. మినిట్స్‌లోని అంశాలను సీరియస్‌గా తీసుకుంది. వాటిని పరిశీలించిన వెంటనే.. 16వ తేదీన నాగార్జున సాగర్‌పై సమీక్షకు రావాలని సీఎస్‌లు కేఎస్ జవహర్‌రెడ్డి, శాంతికుమారిని ఆదేశించింది.

ఖర్చు మీది.. నిర్వహణ మాది

ప్రాజెక్టులు, అవుట్‌లెట్లను అప్పగించిననాటి నుంచి అవన్నీ పూర్తిగా తమ నియంత్రణలోకి వచ్చేస్తాయని బోర్డు చైర్మన్ శివనందన్‌కుమార్ ఒకటో తేదీ నాటి భేటీలో స్పష్టం చేశారు. 'వీటిలో పనిచేస్తున్న సిబ్బందికి జీతభత్యాలు మా ద్వారానే బట్వాడా చేయాల్సి ఉంటుంది. అందుచేత రెండు రాష్ట్రాలూ సిబ్బందికి సంబంధించిన వాస్తవ సమాచారం క్రోడీకరించి మాకు అందజేయాలి. ఇకపై అవుట్‌లెట్లకు మరమ్మతులు చేపట్టాలంటే ముందస్తుగా మా ఆమోదం తీసుకోవాలి. అవుట్‌లెట్ల నిర్వహణకు భారీ వ్యయం అవుతుంది. ఆ భారాన్ని రెండు రాష్ట్రాలూ భరించాల్సిందే. నిధులు విడుదల చేయాల్సిందే' అని శివనందన్‌కుమార్ స్పష్టం చేశారు. వాస్తవానికి కృష్ణానదిపై నిర్మించిన ప్రాజెక్టులను తమకు స్వాధీనపరచాలని కేఆర్‌ఎంబీ గడచిన తొమ్మిదేళ్లుగా కోరుతున్నా.. తెలంగాణ మాత్రం ఎప్పటికప్పుడు దాటవేస్తూ వస్తోంది. గత నెల 17వ తేదీన జరిగిన సమావేశంలో ప్రాజెక్టులను తక్షణమే అప్పగించాలని.. ఇందుకు వారం రోజులు గడువిస్తున్నామని కేంద్ర జలశక్తి శాఖ ఆదేశించింది. కేంద్ర నిర్ణయాన్ని తెలంగాణ వ్యతిరేకించింది. మినిట్స్‌లో తమ అభ్యంతరాలను చేర్చి సవరించాలని కృష్ణా బోర్డు సమావేశంలో డిమాండ్ చేసింది. కేఆర్‌ఎంబీకి నిర్వహణ వ్యయం కోసం నిధులిచ్చేందుకూ అంగీకరించలేదు. సాగర్ డ్యాంపై తమ భూభాగంలోని గేట్లకు కేంద్ర బలగాల పహరా అవసరం లేదని కూడా స్పష్టం చేసింది. ఏకాభిప్రాయం లేని ఈ పరిస్థితుల్లో.. త్వరలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో.. కృష్ణా బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింత, వాటి నిర్వహణకు రూ.వందల కోట్లు విడుదల ఇప్పట్లో ఉండదని ఏపీ జల వనరుల శాఖ వర్గాలు చెబుతున్నాయి.



ఆర్‌కే బీచ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లోటింగ్ బ్రిడ్జి

అలలపై అలా అలా...!

- విశాఖ తీరంలో చకచకా ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణ పనులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరంలో ఫ్లోటింగ్ బ్రిడ్జి సందర్శకులను అలరించనుంది. ఆర్‌కే బీచ్‌లో ఏర్పాటు చేస్తున్న సముద్రంలో తేలియాడే (ఫ్లోటింగ్) వంతెన పనులు జోరుగా సాగుతున్నాయి. విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) పర్యాటకుల కోసం ఈ ప్రాజెక్టును చేపట్టింది. ప్లాస్టిక్ బ్లాకులతో తీరం నుంచి సముద్రంలో కొంత దూరం వరకు బ్రిడ్జి నిర్మిస్తున్నారు. సముద్ర అలలకు ఈ బ్రిడ్జి పైకి, కిందకు లేస్తూ పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందిస్తుంది. ఈ బ్రిడ్జి నిర్మాణ బాధ్యతను ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఆదివారం సాయంత్రానికి 30 శాతం మేర పనులు పూర్తి చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో దీన్ని అందుబాటులోకి తీసుకువస్తామని చెబుతున్నారు. ఆర్‌కే బీచ్‌కు ఇది సరికొత్త ఆకర్షణగా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.

కారు ఢీకొని ఇద్దరి దుర్మరణం

- మరో ఇద్దరికి గాయాలు.. ఉరవకొండలో ఘటన

ఉరవకొండ, ఫిబ్రవరి4: అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం బూదగవి గ్రామ సమీపాన ఆదివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. కారులోని ఇద్దరు గాయపడ్డారు. జిల్లాలోని విడపనకల్లు మండలకేంద్రానికి చెందిన రామాంజనేయులు(48), రాజు(27) బేల్దారి పనికెళ్తుంటారు. ఆదివారం ఉరవకొండలో పని ముగించుకుని ద్విచక్రవాహనంపై విడపనకల్లుకు వెళ్తుండగా, బూదగవి సమీపాన బళ్లారి నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న రామాంజనేయులు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన రాజును ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడి నుంచి అనంతపురం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కారులో ప్రయాణిస్తున్న కర్ణాటకలోని బళ్లారి వాసులు అభిషేక్, శుక్లా గాయపడ్డారు. రామాంజనేయులుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజుకు భార్య, ఏడాదిలోపు పాప ఉంది. మృతదేహాలను చూసి కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం ఫిబ్రవరి 4: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్లో ఒక గుర్తు తెలియని మావోయిస్టు మృతిచెందాడు. బెజ్జి అటవీప్రాంతంలో కుంట ఏరియా కమిటీ ఏసీఎంలు సోడి గజేంద్ర, పొడియం హడమా, ఎల్‌ఓఎస్ కమాండర్ కోసీలతో కలిసి పదిహేను నుంచి 20 మంది మావోయిస్టులు సంచరిస్తున్నారని పోలీసులకు సమాచారం అందడంతో డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్ దళాలు ఆ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా నగరం-పంతాబేజీ అటవీప్రాంతంలో ఇరువర్గాల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. సంఘటనా స్థలంలో మావోయిస్టు మృతదేహంతోపాటు నాటు తుపాకీ, రైఫిల్, సామగ్రి దొరికాయి.



రాష్ట్ర హోదా కోసం లద్దాఖ్ వాసుల భారీ ర్యాలీ

లేహ్, ఫిబ్రవరి 4: భారీగా కురిసిన మంచుతో గడ్డకట్టిన లేహ్ నగరం వీధుల్లో కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్ వాసులు ఆదివారం ఆందోళన చేశారు. మహిళలతో సహా వేలాది మంది పాల్గొన్నారు. తమ ప్రాంతానికి రాష్ట్ర హోదా ఇవ్వాలని, ఈశాన్య రాష్ట్రాలకు మాదిరిగానే రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌ను వర్తింపజేసి తమ భాష, సంస్కృతులను కాపాడాలని, తమ కోసం ప్రత్యేకంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో లద్దాఖ్.. జమ్ము-కశ్మీర్ రాష్ట్రంలో అంతర్భాగంగా ఉండేది. ఆర్టికల్ 370ని రద్దు చేసి, ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చారు. కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చిన తరువాత తమ ప్రాతినిధ్యం తగ్గినట్టు లద్దాఖ్ వాసులు భావిస్తున్నారు. జమ్మూ-కశ్మీర్ రాష్ట్రంగా ఉన్నప్పుడు ఈ ప్రాంతం నుంచి నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు ఉండేవారు. ఇప్పుడు ప్రజాప్రతినిధులంటూ లేకుండా పోయారని అంటున్నారు.

పల్నాడులో వైసీపీ నేతల భూకబ్జాలు

- రికార్డులు మార్చి రిజిస్ట్రేషన్ చేయాలని అధికారులపై ఒత్తిడి
- టీడీపీ అధికారంలోకి వచ్చాక అన్నింటిపైనా విచారణ
- మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 4: గురజాల నియోజకవర్గంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి దాకా వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు, ప్రైవేటు ఆస్తులను వైసీపీ నేతలు కబ్జా చేస్తున్నారని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం పిడుగురాళ్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో యరపతినేని మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో నిషేధిత భూముల జాబితాలోవున్న పిడుగురాళ్లలోని రామలింగేశ్వరస్వామి దేవాలయ భూములను సైతం ప్రైవేటు వ్యక్తులు, ఎమ్మెల్యే కాసు అనుచరులైన మాజీ జడ్పీటీసీ రామిరెడ్డి, డాక్యుమెంట్ రైటర్ లింగారెడ్డి, వీఆర్వో సత్యారెడ్డిలు మరొకరి పేర్లతో రికార్డులను మార్చి రిజిస్ట్రేషన్ చేయాలని ఆ శాఖ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ప్రభుత్వ భూముల రికార్డులను మార్చి 1-బి, అడంగల్ సృష్టించి తప్పుడు రిజిస్ట్రేషన్లకు పాల్పడిన ఘటనలన్నింటిపై అధికారంలోకి వచ్చిన తరువాత విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. వారి బినామి అయిన ఊటుకూరి శివగోవిందారెడ్డి ప్రైవేటు ఆసుపత్రుల్లో సూపర్‌వైజర్‌గా చేస్తూ కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయని యరపతినేని ప్రశ్నించారు. 2014లో కోనంకిలో కొందరికి ఇచ్చిన పట్టాలు జాబితాలో వైసీపీ అధికారంలోకి వచ్చాక మరో కొన్ని పేర్లు అనధికారికంగా చేర్చేసి రికార్డులు మార్చేయడంతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అన్నపురెడ్డి రామిరెడ్డి, సుశీల పేరుతో 3.31 సెంట్లు, అన్నపురెడ్డి శ్రీలక్ష్మి, వెంకటకృష్ణారెడ్డి పేరుతో 3.42 సెంట్లు, అన్నపురెడ్డి పుష్పావతి, మరొకరి పేరుతో 1.80 సెంట్లును ముగ్గురి పేర్లను పెన్నుతో అనధికారికంగా జాబితాలో చేర్చి హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దాచేపల్లిలోను నకిలీ రేషన్‌కార్డులు సృష్టించి వైసీపీ నేతలు భూపట్టాలకు పాల్పడ్డారన్నారు. బీసీ సామాజికవర్గానికి చెందిన నీలంరాజు ఎంపీ శ్రీకృష్ణదేవరాయులకు మద్దతుగా నిలిచి వైసీపీకి రాజీనామా చేస్తే అతనిపై బెదిరింపులకు పాల్పడటం ఏమిటని యరపతినేని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా గురజాల నుంచి తాను ఏడోసారి పోటీ చేయబోతున్నానని యరపతినేని మరోసారి స్పష్టం చేశారు. సమావేశంలో పాండురంగ శ్రీను, బాబావలి, తురకా వీరస్వామి, కనిగిరి శ్రీను, కోట హరి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, గండికోట వెంకటేశ్వర్లు, సయ్యద్ అమీర్‌అలీ, ఎస్‌ఆర్‌ఎంటీ సుబ్బారావు, పణితి రవి, మేకల సాంబశివరావు, పిల్లి చెన్నారావు, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశిం, వల్లెపు రామకృష్ణ, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

రాక్షస ప్రభుత్వానికి ఎదురొడ్డినందుకు అభినందనలు

- గ్రామ అభివృద్ధి నగ్న సత్యాల కరదీపిక పుస్తకావిష్కరణ
- సాయిబాబాను అభినందించిన మాజీ మంత్రి ఆనందబాబు


కరదీపికను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి ఆనందబాబు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 4: వైసీపీ రాక్షస ప్రభుత్వానికి ఎదురొడ్డి ధైర్యంగా నిలిచిన భట్టిప్రోలు గ్రామ టీడీపీ కార్యకర్తలు అభినందనీయులని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా రూపొందించిన భట్టిప్రోలు గ్రామ అభివృద్ధి నగ్న సత్యాల కరదీపిక పుస్తకాన్ని స్థానిక వాసవీ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం రాత్రి ఆనందబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భట్టిప్రోలు గ్రామ అభివృద్ధిలో సాయిబాబా తనదైన ముద్ర వేసుకున్నారని వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలకు బెదరకుండా కార్యకర్తలకు అండగా నిలిచారని ఆయన సేవలను కొనియాడారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ - జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఇదే స్ఫూర్తితో సమష్టిగా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అన్యాయాలు, అరాచకాలకు రెండింతలు బదులు తీర్చుకుంటామని, అధికార పార్టీకి అండగా నిలిచిన అధికారులను కూడా వదిలిపెట్టేదిలేదని తేల్చి చెప్పారు. గ్రామంలో వైసీపీ నాయకులు దోచుకున్నంతా కక్కిస్తామని అన్నారు. ఈ ప్రాంతంలో అధికంగా ఉన్న చేనేత కార్మికుల సంక్షేమానికి నారా లోకేశ్ ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారని మరింతగా నేతన్నలకు మేలు జరుగుతుందని తెలిపారు. సైకో జగన్‌రెడ్డిని తరిమికొట్టేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని జగన్‌రెడ్డి శాశ్వతంగా జైలుకు వెళ్ళడం ఖాయమని ఆనందబాబు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ వాకా శేషుబాబు, బట్టు మల్లికార్జునరావు, కనపర్తి సుందరరావు, జంగం శ్యాంసన్, గొట్టుముక్కల లెనిన్, ఆదిన బసవపున్నయ్య, లెనిన్ పాల్గొన్నారు.


తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

ధర్మ పోరాటం చేస్తుంటే అక్రమ కేసులా?

- 1510వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు జనవరి 4: మూడు ముక్కల ఆటతో సీఎం జగన్‌రెడ్డి ప్రజాదరణను కోల్పోయాడని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్ర ప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు ఆదివారం నాటికి 1510వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, అమరావతిని బ్రహ్మాండంగా కడతానన్న సీఎం జగన్‌రెడ్డి మాట తప్పాడన్నారు. అమరావతిని నిర్వీర్యం చేయటంతో పోరాటం మొదలు పెట్టామన్నారు. అందుకు అక్రమ కేసులు బనాయించారన్నారు. అమరావతి ఉద్యమాన్ని అణచి వేయటానికి శత విధాల ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన జగన్‌రెడ్డి పాలన.. ఏపీని పూర్తిగా వెనకబాటుకు గురిచేశారన్నారు. అమరావతి రాజధానితో ఎంతో ఉన్నతస్థితికి చేరాల్సిన రాష్ట్రం 20 సంవత్సరాలు వెనక్కివెళ్లిందన్నారు. మూడు ముక్కల ఆటతో ఏపీని సీఎం జగన్‌రెడ్డి అధోగతి పట్టించాడన్నాడు. లక్షల కోట్ల సంపద అమరావతి అని స్పష్టంచేశారు. దానిని ఆవిరి చేశాడని ధ్వజమెత్తారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

మైనార్టీల సంక్షేమాన్ని విస్మరిస్తున్న పాలకులు

- మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షిబ్లి


రాజకీయ చైతన్య సదస్సులో ప్రసంగిస్తున్న ఫారుఖ్ షిబ్లి

మంగళగిరి, ఫిబ్రవరి 4: పాలక ప్రభుత్వాలు ముస్లిం మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణిస్తూ వారి సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారుఖ్ షిబ్లి అన్నారు. మంగళగిరి పట్టణంలోని ఈద్గా షాదీఖానాలో ఆదివారం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఇస్లామిక్ ఫ్రంట్ సహకారంతో రాజకీయ చైతన్య సదస్సు జరిగింది. అంజుమన్ అధ్యక్షుడు షేక్ అక్రమ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో షిబ్లి మాట్లాడుతూ రాష్ట్రంలో చాలా మంది సిద్ధం.. సిద్ధం అంటున్నారని, వారు సిద్ధమైతే ప్రజలు కూడా సంసిద్ధంగా వున్నారని చెప్పారు. పాలక ప్రభుత్వాలు ముస్లిం మైనార్టీల హక్కులను కాలరాస్తున్నాయని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీలపై లెక్కలేనన్ని దాడులు జరిగాయన్నారు. గతంలో దుల్హన్, విదేశీ విద్య పథకాల నిధులను పొందేందుకు మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఎంతగానో కృషి చేసిందని చెప్పారు. సమితి రాష్ట్ర కార్యదర్శి షేక్ అక్రమ్ మాట్లాడుతూ ముస్లింలకు రాజకీయంగా పదవులు కేటాయించిన వారికే తమ మద్దతు వుంటుందన్నారు. ఈ సదస్సులో జమియత్ ఉలేమా ఏపీ కన్వీనరు మౌలానా హస్నేన్ మజాహరి, సమితి లీగల్ సెల్ అధ్యక్షుడు ఎండీ సలీం పాషా, మానవతా సందేశ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా మక్బూల్ అహ్మద్ నద్వి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు విడుదల చేస్తున్న జేఏసీ నాయకులు జిలాని, పవన్‌తేజ తదితరులు

7 నుంచి ఢిల్లీలో హోదా కోసం నిరసన

గుంటూరు, ఫిబ్రవరి 4: ప్రత్యేక హోదాతో పాటు బడ్జెట్‌లోనూ వివక్షపై ఈనెల 7, 8, 9వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తలపెట్టిన నిరసన ధర్నా, పార్లమెంటు ముట్టడి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రత్యేక హోదా విద్యార్థి, యువజన జేఏసీ నేత జిలాని పిలుపునిచ్చారు. అరండల్‌పేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు పోస్టర్లను విడుదల చేశారు. జిలాని మాట్లాడుతూ ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె పవన్‌తేజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలి స్వార్థ ప్రయోజనాలకు పాకులాడుతున్న వైసీపీకి రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు. ఏపీకి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు మౌర్య శీలం, షేక్ మహమూద్, ప్రదీప్, ఆరిఫ్ బాషా తదితరులున్నారు.


యువ వ్యాపార వ్యవస్థాపకుల సదస్సుకు హాజరైన పూర్వ విద్యార్థులు, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రతినిధులు

ఉపాధి కల్పించే స్థాయికి విద్యార్థులు ఎదగాలి

- కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వీసీ సారధివర్మ

తాడేపల్లి, ఫిబ్రవరి 4: నిరుద్యోగులకు ఉపాధి కల్పించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని, తమ వర్సిటీ పూర్వ విద్యార్థులు తమ కాళ్లమీద నిలబడి వ్యాపారాలు స్థాపించి ఎదగడం సంతోషకరమని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వీసీ సారధివర్మ అన్నారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఆదివారం యువవ్యాపార వ్యవస్థాపకుల సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ చెన్నై, బెంగుళూరులలో నూతనంగా వ్యాపారాలు స్థాపించిన కేఎల్‌యూ పూర్వ విద్యార్థులందరూ పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సదస్సుకు పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీకావ్య అధ్యక్షత వహించారు. సదస్సులో అమరావతి బోటింగ్ క్లబ్ వ్యవస్థాపకుడు, కేఎల్‌యూ పూర్వ విద్యార్థి తరుణ్ కాకాని మాట్లాడుతూ కేఎల్‌యూ ప్రాంగణంలో ఎన్నో కొత్త ఆలోచనలకు, కొత్త సౌకర్యాలకు నాంది పలకడం జరిగిందని, నూతన వ్యాపారాలు స్థాపించాలనే ఆలోచనకు బీజం పడిందని చెప్పారు. నూతన వ్యాపారాలు స్థాపించాలనే విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోవీసీలు డాక్టర్ వెంకటరామ్, ప్రసాద్, రిజిస్ట్రారు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సీహెచ్ శ్రీకావ్య, సోని, సీనియర్ మేనేజర్ కృష్ణారావు, బీబీఏ, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.


నిందితులతో రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, పోలీసు సిబ్బంది

10 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురు నిందితుల అరెస్టు

నాదెండ్ల, ఫిబ్రవరి 4: అక్రమంగా హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్న కేసుకు సంబంధించి మరో ముగ్గురు నిందితులను చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి ఆదివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి పదికిలోల గంజాయితో పాటు రెండు మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని పోలీసులు వివరించారు. గత నెల 31వ తేదీన సీలేరు నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరిని నిందితులను యడ్లపాడు మండలంలోని తిమ్మాపురం వద్ద అరెస్టు చేసి సుమారు 107 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఇదే కేసులో పోలీసులకు అందిన సమాచారం మేరకు గణపవరంలోని చవిటిపాలెం అడ్డరోడ్డు వద్ద ముగ్గురిని అరెస్టు చేశారు. వీరు హైదరాబాద్ చింతలబస్తీకి చెందిన కడం ఉల్లాస్, సీలేరుకు చెందిన గొలరి శంకర్‌రెడ్డి, గుణశేఖర్‌లుగా గుర్తించారు. ముగ్గురు నిందితులను రిమాండ్‌కు పంపారు.

కంప్యూటర్ సెంటర్‌పై దాడి

- ఇద్దరికి గాయాలు


ధ్వంసమైన కంప్యూటర్ సెంటర్

రెంటచింతల, ఫిబ్రవరి 4: మండల కేంద్రమైన రెంటచింతలలో ఆదివారం రాత్రి మండలంలోని రెంటాలకు చెందిన ఎన్.చెన్నారెడ్డి, అశోక్‌రెడ్డి, రాజశేఖరరెడ్డితోపాటు మరో 9 మంది పోలీస్‌స్టేషన్ రోడ్డులోని కంప్యూటర్ సెంటర్‌పై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. కారంపూడి సీఐ చిన మల్లయ్య, ఎస్‌ఐ కేవీ నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 2న కానుకమాత తిరునాళ్ల సందర్భంగా ఓ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తులు జెండాలు చేతబూని హడావుడి చేస్తుండడంతో చర్చి పెద్దలైన వడ్లపల్లి భాస్కరరెడ్డి, ఓరుగంటి ఇన్నారెడ్డి ఆలయ ప్రాంగణంలో అటువంటివి వద్దని వారితో వారించారు. ఈ ఘటనే పెద్దరిగామారి ఆదివారం రాత్రి దాడికి దారితీసింది. అద్దాలు పగలడంతో ఇరువురు వ్యక్తులు గాయపడ్డారు. గాయాలైన వారిని గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.


స్వాధీనం చేసుకున్న నాటుసారాతో సెబ్ అధికారులు

30 లీటర్ల సారా స్వాధీనం

మాచర్ల, ఫిబ్రవరి 4: మాచర్ల పట్టణంలో పలుచోట్ల సెబ్ అధికారులు ఆదివారం దాడులు జరిపి 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే గేటు వద్ద కొమెర శ్రీనివాసరావు వద్ద 10 లీటర్లు, కూరగాయల మార్కెట్ వద్ద మరో వ్యక్తి వద్ద 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని వారివురిని అదుపులోకి తీసుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

భట్టిప్రోలు, ఫిబ్రవరి4: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కోళ్ళపాలెం సమీపంలో చోటు చేసుకుంది. స్టేషన్ రైటర్ సైకం నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... కొల్లూరు మండలం గుంటూరుగూడెంకు చెందిన గురిందపల్లి శామ్యూల్ (38) చెట్టు నరికే పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వివిధ పనుల నిమిత్తం శనివారం ద్విచక్రవాహనంపై రేపల్లె వెళ్ళాడు. రాత్రి 8 గంటల సమయంలో భార్య ఫోన్ చేయగా రేపల్లె నుంచి కరకట్టపై వస్తున్నానని కోళ్ళపాలెం సమీపంలో ఉన్నానని సమాచారం తెలియజేశాడు. ఆతర్వాత ఫోన్ చేసినప్పటికీ ఎటువంటి స్పందన లేదు. ఓలేరు - పెదపులివర్రు మధ్యలో కోళ్ళపాలెం సమీపంలో కరకట్ట రోడ్డుపై శామ్యూల్ గాయాలపాలై కొనఊపిరితో ఉండడాన్ని గమనించిన స్థానికులు ఆదివారం ఉదయం పోలీసులకు సమాచారం చేరవేశారు. 108 వాహనం ద్వారా రేపల్లె వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే శామ్యూల్ మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఉండొచ్చని సందేహం వ్యక్తంచేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరుకుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాగరాజు తెలియజేశారు.


రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


విజయ్ (ఫైల్)

చేబ్రోలు, ఫిబ్రవరి4: చేబ్రోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... మోదుకూరు గ్రామానికి చెందిన చల్లాపల్లి విజయ్ (23) గుంటూరులో పని చేస్తున్నాడు. ఆదివారం పనిముగించుకొని ద్విచక్రవాహనంపై మోదుకూరు బయల్దేరిన విజయ్ సెయింట్ మేరీస్ కళాశాల సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. విజయ్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొనగా కింద పడిపోయిన విజయ్‌పై వెనక నుంచి వస్తున్న లారీ ఎక్కడటంతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రైలుఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి

దుగ్గిరాల, ఫిబ్రవరి 4: రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు(60) మృతిచెందాడు. విజయవాడ వైపు నుంచి వస్తున్న కొచ్చువేలీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(22647) ఢీకొని వ్యక్తి మృతదేహం ఆదివారం సాయంత్రం దుగ్గిరాల రైల్వేగేటు వరకూ ఇంజన్ ముందుభాగాన వేలాడుతూ వచ్చింది. మోరంపూడి వద్ద గుర్తించిన రైల్వేసిబ్బంది దుగ్గిరాల స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ప్రమాద ఘటన చిలువూరు వడ్లపూడి మధ్య జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు.


ఈత కొడుతున్న స్విమ్మర్లు

ఉత్సాహంగా ఈత పోటీలు

తాడేపల్లి, ఫిబ్రవరి 4: ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 24వ కృష్ణా నది రివర్ క్రాస్ రాష్ట్రస్థాయి ఈత పోటీలను ఆదివారం నిర్వహించారు. విజయవాడ దుర్గాఘాట్ నుంచి సీతానగరం వరకు జరిగిన ఈత పోటీల్లో ఏపీ, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర నుంచి మొత్తం 367 మంది పురుషులు, 66 మంది మహిళలు పాల్గొన్నారు. ఆరు కేటగిరీలుగా ఈతల పోటీలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ఈత పోటీలను దుర్గా ఘాట్ వైపు మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ సెలక్షన్ కమిటి మాజీ చైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్, దివీస్ లాబొరేటరీ లిమిటెడ్ మాజీ డైరెక్టర్ దివి మధుసూదన రావు, లైలా గ్రూప్ కంపెనీస్ డైరెక్టర్ గోకరాజు ఆదిత్యవర్మ ప్రారంభించారు. అనంతరం ఉండవల్లి కరకట్ట వద్ద వున్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ వచ్చే ఏడాది 25వ కృష్ణానది రివర్ క్రాస్ ఈత పోటీలను జాతీయ స్థాయిలో నిర్వహిస్తామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పురుషులు, మహిళా స్విమ్మర్లు పోటీలలో పాల్గొనడం విశేషమన్నారు. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ సెలక్షన్ కమిటి మాజీ చైర్మన్ ఎంఎస్‌కె ప్రసాద్ మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది విజయవంతంగా ఈత పోటీలను నిర్వహించడమే కాక ప్రతి ఏడాది సమ్మర్ కోచింగ్ క్యాంప్ ద్వారా ఉచితంగా ఈత నేర్పడం విశేషమన్నారు. మానసిక ఉల్లాసానికి దేహదారుఢ్యానికి ఈత ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. దివి మధుసూదనరావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ఒక స్వచ్ఛమైన రిజర్వాయర్ వున్న నీళ్లలో ఈత పోటీలు ఎట్టి అడ్డంకులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అసోసియేషన్ వారు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వెలగపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ, కార్యదర్శి ఎం ఎల్ నరసరాజు, కన్వీనర్ అమ్మిరెడ్డి రామిరెడ్డి, కమిటి సభ్యులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


బహుమతి గ్రహీతలతో మాజీ ఎంపీ గంగరాజు, ఎంఎస్‌కే ప్రసాద్

గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో దేవాంగులు

- దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు
- మంగళగిరిలో ఆత్మగౌరవ ర్యాలీ



ఆత్మగౌరవ ర్యాలీలో పాల్గొన్న దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 4: ఇచ్ఛాపురం నుంచి ధర్మవరం వరకు ప్రతి నియోజకవర్గంలో దేవాంగుల ఓట్లు పది వేల నుంచి 15 వేల వరకు వున్నాయని, వీటి ద్వారా ఆయా రాజకీయ పార్టీల గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో ఉన్నామని ఏపీ దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీకే నాగరాజు తెలిపారు. ఏపీ దేవాంగ సంక్షేమ సంఘం, అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరిలో ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. చినకాకాని ఎన్నారై జంక్షన్‌లోని నేతన్న విగ్రహం వద్ద నుంచి పాతమంగళగిరి మీదుగా ఆర్‌ఆర్ కన్వెన్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది జనాభా వున్న దేవాంగులకు రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. రాజకీయంగా బలోపేతం అయితేనే దేవాంగుల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. అమరావతి సంఘం అధ్యక్షుడు బల్ల వెంకటరమణ మాట్లాడుతూ దేవాంగులు రాజకీయ చైతన్యం పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జా హేమలత, నేతలు బీరక ప్రసాద్, ఆకాశపు స్వామి, నక్కిన రాజశేఖర్, నక్కిన విజయలక్ష్మి, ఏరాసు అరుణ్‌బాబు, ఆనెం ఆనంద్‌కుమార్, పులి రామచంద్ర, గిద్దలూరి ఎర్రస్వామి, సజ్జా వెంకటేశ్వరరావు, అల్లక సిరిప్రసాద్, నక్కిన దొరబాబు, అల్లక తాతారావు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.38
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234.00
చికెన్ స్కిన్ లెస్	244.00



మాచర్లలో పార్టీలో చేరిన వారితో బ్రహ్మారెడ్డి

పదిహేనేళ్లుగా మాచర్లలో అభివృద్ధి శూన్యం

- ఒక్క అవకాశమివ్వండి రూపురేఖలు మారుస్తా
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

కారంపూడి, ఫిబ్రవరి 4: పదిహేనేళ్లుగా మాచర్ల నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని, తనకు ఒక్కసారి అవకాశమిస్తే నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానని టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. కారంపూడి సుద్ధగుంతల కాలనీలో ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన 60 వైసీపీ కుటుంబాలు ఆదివారం పార్టీని వీడి టీడీపీలో చేరారు. ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాల పేరుతో అన్ని వర్గాలను మోసం చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. ఎన్నికలకు ముందు సంపూర్ణ మద్యపాన నిషేధమని చెప్పి మాట తప్పిన నేత జగన్ అన్నారు. అధికారంలోకి వచ్చాక నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ చెప్తున్న జగన్ ఆయా కార్పొరేషన్లు నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. గత ఎన్నికల సమయంలో వరికపూడిశెల పూర్తి చేస్తేనే ఓటు అడుగుతామని చెప్పి ఇప్పుడు ఎన్నికలకు ఆరు నెలల ముందు వరికపూడిశెలకు శంకుస్థాపన చేశారన్నారు. తనను అవకాశమిస్తే నియోజకవర్గంలో ఫ్యాక్షన్‌ను రూపుమాపి శాంతియుత వాతావరణం నెలకొల్పి స్వేచ్ఛావాయువులను అందిస్తానన్నారు. భూకబ్జాలకు అడ్డుకట్ట వేసి పేదల ఆస్తులను కాపాడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్, మండల మాజీ అధ్యక్షుడు చప్పిడి రాము, బొల్నేడి శ్రీనివాసరావు, మాజీ ఉప ఎంపీపీ పంగులూరి పుల్లయ్య, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, బీసీ సెల్ అధికార ప్రతినిధి గోరంట్ల నాగేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షుడు తుపాకుల రత్తయ్య, మస్తాన్‌జాని, ఉన్నం శ్రీనివాసరావు, బాలునాయక్, కాల్వ పేరయ్య, వసంత రామారావు, కరణం రవి తదితరులు పాల్గొన్నారు.

పేదలను దోచుకుంటున్న పనికిమాలిన ప్రభుత్వం : బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 4: పేదలను దోచుకుంటున్న పనికిమాలిన ప్రభుత్వం వైసీపీ అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. పట్టణంలోని 25వ వార్డుకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 20 వైసీపీ కుటుంబాలు ఆదివారం ఆ పార్టీని వీడి వైసీపీలో చేరారు. బ్రహ్మారెడ్డి వీరికి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాలను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. నాలుగుసార్లు గెలిచిన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన కుటుంబాన్ని అభివృద్ధి చేసుకున్నారు తప్ప మాచర్లలో అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. జనవరి జాబ్ క్యాలెండర్ వేస్తామని చెప్పి సుమారు 60 వేలకు పైగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులకు 6100 మాత్రమే విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, బాబుఖాన్, మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు నాగూర్‌బాషా, చందు, లాలాకృష్ణ, మదిన్, లక్ష్మణ్, శేఖర్, అనిల్, నరసింహారావు పాల్గొన్నారు.

మాచర్ల మండలంలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు సామాజిక వర్గాలకు చెందిన 50 వైసీపీ కుటుంబాలు ఆదివారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వెల్దుర్తిలోని టీడీపీ కార్యాలయంలో వారు బ్రహ్మారెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బ్రహ్మారెడ్డికి వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న వైసీపీని గద్దె దించేందుకు టీడీపీ, జనసేన కూటమిలో చేరినట్లు వారు చెప్పారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జికి ఎమ్మెల్యే కాసు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తదితరులు

పిడుగురాళ్ల, ఫిబ్ర వరి 4 : పిడుగురాళ్ల-జానపాడు రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శంకుస్థాప న చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో పట్టణ ప్రజలతో పాటు మరెన్నో గ్రామాలకు ట్రాఫిక్ సమస్య తగ్గిపోతుందని తెలిపారు. సుమారు 52 కోట్ల రూపాయలతో రైల్వే బ్రిడ్జి పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, ఆర్‌టిఐ మాజీ కమిషనర్ రేపాల శ్రీనివాసరావు, భవనాశి యల్లారావు, గఫార్, వున్నం నరసింహారావు, వైస్ ఛైర్మన్ ముక్కంటి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆసరా సభకు అధికారులు సమాచారం ఇచ్చారు : కాసు

దాచేపల్లి, ఫిబ్రవరి 4 : గామాలపాడు గ్రామంలో ఆదివారం జరిగే ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జంగా సురేష్‌కు స్థానిక అధికారులు ఒకరోజు ముందుగానే సమాచారం ఇచ్చారని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం దాచేపల్లి ఆర్‌అండ్‌బి బంగ్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఆయన తనయుడు, సర్పంచ్ జంగా సురేష్ ఏ విధంగా అపోహ పడ్డారో తెలియదు కాని సమాచారం మాత్రం అధికారులు ఇచ్చారనేది వాస్తవమన్నారు. గామాలపాడు గ్రామంలో జరిగే ఆసరా సభ మంగళవారం తిరిగి నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే కాసు తెలిపారు. అనంతరం మండలంలోని శ్రీనగర్, రామాపురం, పొందుగల గ్రామాలలో ఆసరా చెక్కుల పంపిణీ, మంచినీటి కుళాయిల ఏర్పాటుకై శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ కటకం జయశ్రీ, మూలగుండ్ల ప్రకాష్‌రెడ్డి, కొప్పుల సాంబయ్య, మందపాటి రమేష్‌రెడ్డి, టమాట సుభాని, కందుల జాన్, కోట కృష్ణ, కిష్టిపాటి అంకిరెడ్డి, బత్తుల లింగారెడ్డి, శ్రీనగర్ సర్పంచ్ కూసం నాగిరెడ్డి, ఆకూరి వీరారెడ్డి, తదితరులున్నారు.

లయోల ప్రేమనివాసం విద్యార్థులకు అన్నదానం

మాచవరం ఫిబ్రవరి 4 : చింతలపూడి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు, పల్నాడు హాస్పటల్ అధినేత చింతలపూడి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మాచవరంలోని లయోల ప్రేమనివాసంలో విద్యార్థులకు ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చింతలపూడి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు పుసులూరి శ్రీనివాసరావు, ఆర్‌ఎంపి లింగయ్య తదితరులు ట్రస్టు వ్యవస్థాపకులు, డాక్టర్ అశోక్‌కుమార్ సూచనల మేరకు లయోల ప్రేమనివాసం విద్యార్థులకు అన్నదానం ఏర్పాటు చేసి విద్యార్థులచే కేక్‌ను కట్ చేయించారు.

లూథరన్ చర్చికి ఏసుప్రభు విగ్రహం బహుకరణ

మాచవరం, ఫిబ్రవరి 4: స్థానిక ఎస్సీ కాలనీలోని ఇవాంజిలికల్ లూథరన్ చర్చికి అంబేద్కర్ కాలనీకి చెందిన రాగిడి పెదరాజు, రాగిడి చినరాజు, రాగిడి గురవయ్య అనే అన్నదమ్ములు కలిసి ఏసుక్రీస్తు విగ్రహాన్ని ఆదివారం బహుకరించారు. కేరళ రాష్ట్రంలో సుమారు రూ.లక్ష వ్యయంతో ఫైబర్ విగ్రహాన్ని తయారు చేయించి చర్చికి అందజేశారు. మరో రూ.లక్షతో చర్చి నిర్మాణానికి కావలసిన దర్వాజాలను ఏర్పాటు చేశారు. పాస్టర్ ఫిలిప్‌బాబు వారిని అభినందించారు.

పాత కక్షల నేపథ్యంలో వ్యక్తికి కత్తిపోట్లు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 4 : రాజుపాలెం మండలం పెద నెమలిపురికి చెందిన వేముల వీరయ్యను అదే గ్రామానికి చెందిన మల్లికార్జునరావు కత్తితో పొడిచి గాయపరిచిన సంఘటన ఆదివారం గ్రామంలో జరిగింది. వేముల వీరయ్య, అతని స్నేహితుడు సాంబశివరావు కలసి నెమలిపురి నుంచి మోటారు సైకిల్‌పై పిడుగురాళ్ళ వైపు బయలుదేరగా అదే గ్రామానికి చెందిన మల్లికార్జునరావు గ్రామంలోనే కత్తితో పొడిచి గాయపరిచాడు. కుటుంబ సభ్యులు వీరయ్యను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. వీరయ్య ఫిర్యాదు మేరకు రాజుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు.

మాచర్ల రూరల్ సీఐగా సురేష్



సీఐ సురేష్

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 4 : మాచర్ల రూరల్ సీఐగా సురేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన సమీవుల్లా బదిలీపై ప్రకాశం జిల్లా దర్శి వెళ్లారు.

చంద్రబాబు వస్తేనే మహిళలకు భరోసా

- మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రజా ప్రభుత్వం ఏర్పాటుతోనే మహిళలకు భరోసా కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం రాత్రి జానపాడు గ్రామంలో 5వ రోజు బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, పార్టీ నాయకులు, యువత యరపతినేనికి ఘనంగా స్వాగతం పలికారు. జానపాడులో అభివృద్ధి అంతా టీడీపీ హయాంలోనే జరిగిందని, వైసీపీ హయాంలో అక్రమ గ్రావెల్ తరలింపు తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో గండికోట వెంకటేశ్వర్లు, చింతలపూడి రామ్మూర్తి, ముప్పాళ్ల సాంబయ్య, వడ్డవల్లి సర్వేశ్వరరావు, వున్నం సురేష్, బండ్ల వెంకటేష్, యేలూరి డిల్లీ, కామిశెట్టి రమేష్, బండ్ల లక్ష్మణరావు, యడ్లపల్లి నారాయణ, శివ, మేకల సాంబశివరావు, యర్నాన రామకృష్ణ, పసుపులేటి నరసింహారావు, ముప్పాళ్ల రమేష్, మక్కెన రాజు, మౌలాలి, రఫీ, పాదర్తి రాజేశ్వరి, పి.వెంకటరమణ, నాగుర్‌బి ఉన్నారు.

యరపతినేని ఆర్థిక సహాయం

జానపాడు గ్రామానికి చెందిన తాపీమేస్త్రి బత్తుల శ్రీనివాసరావు ప్రమాదవశాత్తు గాయపడటంతో ఆదివారం యరపతినేని శ్రీనివాసరావు ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని 2వ వార్డులో ప్రమాదవశాత్తు గాయపడిన షేక్ జానికి యరపతినేని శ్రీనివాసరావు అందించిన రూ.10 వేలను స్థానిక నాయకులు వడ్డవల్లి సాంబశివరావు, సయ్యద్ అమీర్‌అలి, జొన్నలగడ్డ శ్రీను, బొల్లా శ్రీను, చల్లగుండ్ల శ్రీను, యామని వెంకటరావు, తదితరులు అందజేశారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని లెనిన్‌నగర్ 32వ వార్డుకు చెందిన ఎస్సీ, ముస్లిం మైనారిటీ సామాజికవర్గాలకు చెందిన 20 కుటుంబాల వారు ఆదివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అధికార వైసీపీ గెలుపునకు కృషి చేసిన తరువాత పట్టించుకోకపోవడంతో పాటు సరైన గౌరవం లభించకపోవడం, కార్యకర్తలకు వెన్నంటి వుండే యరపతినేని విజయాన్ని కాంక్షిస్తూ వైసీపీని వీడి టీడీపీలో చేరామని లంజపల్లి మరియబాబు, ప్రశాంతబాబు, సయ్యద్ ఆదాం షఫీ తెలిపారు. టీడీపీలో చేరిన వారిలో లంజపల్లి ఏసయ్య, లక్కా సాగర్, కొమ్ము మేరిబాబు, పత్తిపాటి వీరబ్రహ్మం, కొమ్ము సాగర్, ఏసుబాబు, మందా



టీడీపీలో చేరిన లెనిన్‌నగర్ యువకులతో యరపతినేని శ్రీనివాసరావు

ప్రేమ్‌కుమార్, సుందరరావు, నాగరాజు, అశోక్, మరియదాసు, వేల్పుల కల్యాణ్, సాగర్, మరియదాసు, సతీష్, పత్తిపాటి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. వీరందరికీ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బత్తుల శ్రీను, కొమెర శ్రీను, తురకా వీరస్వామి, వేముల ఆంజనేయులు, కుంచపు గంగరాజు, వల్లెపు రామకృష్ణ, దేవళ్ల రాంబాబు, కుంచపు శ్రీను, తమ్మిశెట్టి శివాంజనేయులు, కొమెర జయకృష్ణ, మాణిక్యరావు, చిలకా చిన్న, షేక్ మస్తాన్‌వలి, పఠాన్ ఖాశిం, షేక్ భాష, దూదేకుల భాష, బండారు గంగరాజు తదితరులున్నారు.

వడియరాజులకు సముచిత స్థానం

నియోజకవర్గంలో వడియరాజులకు తగిన సముచిత స్థానాన్ని కల్పించడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వడియరాజులతో సమావేశం నిర్వహించారు. స్థానికంగా వున్న మైనింగ్ క్వారీలలో వడ్డెరలకే అధిక ప్రాధాన్యత ఇస్తామని, రాబోయే ఎన్నికలలో సర్పంచ్ నుంచి జడ్పీటీసీ పదవుల వరకు వడియరాజులను కొందరిని ఎంపిక చేస్తామన్నారు. రేపటి ఎన్నికలలో టీడీపీ గెలుపునకు వడియరాజులంతా ఊరూరా తిరిగి వైసీపీ హయాంలో జరిగిన అన్యాయంతో పాటు దాచేపల్లిలో నీలకంఠబాబు హత్య ఉదంతాన్ని వివరించాలన్నారు. ఈ సమావేశంలో తురకా వీరస్వామి, వేముల ఆంజనేయులు, వల్లెపు రామకృష్ణ, బత్తుల శ్రీను, దేవళ్ల రాంబాబు, కుంచపు గంగరాజు, బత్తుల రాంబాబు, వేముల కృష్ణ, మల్లెల కొండలు పాల్గొన్నారు.



ఆసరా చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పీఆర్కే

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : పీఆర్కే

రెంటచింతల, ఫిబ్రవరి 4 : మహిళల ఆర్థికాభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని, అందుకనే వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ పీఆర్కే అన్నారు. రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల నాల్గవ విడత ఆసరా చెక్కులను ఆదివారం వేలాది మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ పేర్ల చౌడమ్మ అధ్యక్షత వహించారు. 738 గ్రూపులకు రూ.7 కోట్ల 22 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ ఎస్.నర్సిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ గొట్టం బ్రహ్మారెడ్డి, మాజీ కన్వీనర్ పూజల రామయ్య, మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు దాసరి చౌడేశ్వరీ, శౌరైడ్డి, ఎంపీటీసీలు సంపూర్ణమ్మ, ప్రతాపరెడ్డి, మాజీ జడ్పీటీసీ భాస్కరరెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాపరెడ్డి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ మోర్తల ఉమ, మద్దిరాల కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ ఇన్నారెడ్డి, వైసీపీ మండల యూత్ అధ్యక్షులు సతీష్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ సాయి మార్కొండారెడ్డి, చల్లా మట్టారెడ్డి, పేర్ల ముత్తయ్య యాదవ్, ఏరువ భాస్కరెడ్డి, గొట్టం భాస్కరరెడ్డి, ఏలూరి సత్యం, బంకూరి తిరుపతిరావు, గూలి వెంకటరెడ్డి, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, అంజమ్మ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైసీపీలో చేరిక

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 4 : మండలంలోని కంభంపాడుకు చెందిన టీడీపీ నేత పాత శ్రీనివాసరావు ఆదివారం ఆ పార్టీని వీడి వైసీపీలో చేరారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

నిత్య సహాయమాత మహోత్సవాలు ప్రారంభం

మాచర్ల, ఫిబ్రవరి 4 : పట్టణంలోని ఆర్సీఎం చర్చిలో ఆదివారం నిత్య సహాయమాత 58వ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పతాకావిష్కరణ చేశారు. ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డి భక్తులకు దైవ సందేశమందించారు. ఫాదర్ కొమ్మారెడ్డి రాయపరెడ్డి ఆధ్వర్యాన ఆటల పోటీలు జరిపారు. ఈనెల 13వ తేదీ వరకు మహోత్సవాలు జరుగుతాయని రాయపరెడ్డి తెలిపారు.

రెండు పూరిగుడిసెలు దగ్ధం

గురజాలటౌన్, ఫిబ్రవరి 4: రెండు పూరిగుడిసెలు దగ్ధమైన సంఘటన మండలంలోని గొట్టిముక్కలలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన నలబోతుల గోవిందు, అతని మామ రాజబోయిన శ్రీనివాసరావు నివసిస్తున్న పూరిగుడిసెలు పక్కపక్కనే ఉంటాయి. ఆదివారం గోవిందు భార్య దేవుని వద్ద దీపారాధన చేసి కుటుంబసభ్యులంతా పొలం పనులకు వెళ్లారు. గుడిసె నుంచి పొగ లతోపాటు ఒక్కసారిగా నిప్పులు చెలరేగాయి. ఫైర్ ఇంజను వచ్చేసరికి పూరిగుడిసెలు రెండూ పూర్తిగా దగ్ధమయ్యాయి. గృహోపకరణాలతోపాటు రూ.1.80 లక్షల నగదు దగ్ధమయ్యాయని బాధితులు వాపోయారు.



కనుమూరికి సన్మాన పత్రం అందజేస్తున్న హెనీ క్రిస్టినా, వసంత రాయుడు

మచ్చలేని అధికారి కిషోర్ కుమార్

- జడ్పీ ఛైపర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 4: సర్వీసులో మచ్చలేని అధికారిగా పేరొందిన మంచి మనిషి కనుమూరి కిషోర్‌కుమార్ అని జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. ఆదివారం గుంటూరు జడ్పీ సమావేశ మందిరంలో మండలపరిషత్ పరిపాలన అధికారిగా ఉద్యోగ విరమణ చేసిన కిషోర్‌కుమార్‌కు అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హెనీక్రిస్టినా వెండి, బంగారం కంటే మంచి పేరు సాధించాలన్న సూక్తిని కిషోర్‌కుమార్ అక్షరాల సార్థకం చేసుకున్నారన్నారు. జడ్పీ సీఈవో వసంతరాయుడు మాట్లాడుతూ సమాజంలో పది మందికి, విధి నిర్వహణలో తోటి సిబ్బందికి ఆదర్శప్రాయుడు కిషోర్‌కుమార్ అని కీర్తించారు. సభకు ఏపీపీఆర్ ఎంఈఏ రాష్ట్రశాఖ గౌరవాధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, ఏపీపీఆర్ ఎంఈఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూచిపూడి మోహన్‌రావు సభా పరిచయం చేశారు. కార్యక్రమంలో జడ్పీ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి జే.మోహన్‌రావు, జిల్లా ప్రజా పరిషత్ గణాంకాధికారి జీ.శ్రీనివాసరావు, బెల్లంకొండ ఎంపీపీ మీరయ్య, జడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ సాంబిరెడ్డి, జడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరా సభలో అవమానం

- పార్టీని నమ్ముకుంటే పక్కన పెట్టారు
- కన్నీటి పర్యంతమైన దైద సర్పంచ్ లక్ష్మీబాయి



లక్ష్మీబాయి

గురజాలటౌన్, ఫిబ్రవరి 4 : పార్టీని నమ్ముకొని కష్టాలపాలై ఆస్తులను అమ్ముకుంటే నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టారు.. గిరిజన కుటుంబమని చులకనగా చూస్తూ అవమానిస్తున్నారని దైద వైసీపీ సర్పంచ్ లావూరి లక్ష్మీబాయి కన్నీటి పర్యంతమయ్యారు. మండలంలోని దైదలో నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొని మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. ప్రోటోకాల్ ప్రకారం సర్పంచ్‌ను స్టేజి మీదకు ఆహ్వానించాల్సి ఉండగా అలా జరగలేదు. సర్పంచ్ లావూరి లక్ష్మీబాయి సామాన్యురాలిలా స్టేజ్ కిందనే ఉండిపోయింది. కార్యక్రమం ముగించుకొని స్టేజి దిగి వస్తున్న ఎమ్మెల్యే కాసును.. పార్టీ కోసం కష్టపడినందుకు తనను ఇంతలా అవమానిస్తారా అంటూ సర్పంచ్ ప్రశ్నించగా ఏంటి వేషాలు వేస్తున్నారంటా అని ఎమ్మెల్యే కాసు అక్కడి నుంచి వెళ్లిపోయారని సర్పంచ్ లక్ష్మీబాయి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె ఆంధ్రజ్యోతికి ఫోన్ చేసి తన గోడు వెళ్లబోసుకున్నారు. తమది గిరిజన కుటుంబం కావడం వలనే చులకనగా చూసి అవమానిస్తున్నారని వాపోయింది. గతంలో గడపగడపకు కార్యక్రమంలో కూడా శిలాఫలకాల్లో తన పేరు లేకుండా చేశారన్నారు. తన భర్త కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించారని, అప్పటి నుంచి తమ కుటుంబం చాలా కష్టాలు పడ్డామని చెప్పారు. సర్పంచ్‌కు రావాల్సిన జీతం సైతం రాకుండా నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని కన్నీరు పెట్టుకుంది.

బీసీలకు అండగా వైసీపీ ప్రభుత్వం : ఎమ్మెల్యే నంబూరు

బెల్లంకొండ, ఫిబ్రవరి 4 : బీసీల అభ్యున్నతికి పాటు పడుతున్న ఏకైక ప్రభుత్వం తమదేనని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. బెల్లంకొండ మండలంలోని వన్నాయపాలెం గ్రామంలో రూ.35 లక్షలతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాల్‌ను ఆదివారం ఆయన ప్రారం భించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు అన్ని రకాలుగా అండగా నిలిచామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ వెంకటేశ్వరరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, చింతారెడ్డి సాయిరెడ్డి, మహమ్మద్ పాషా, మర్రి ప్రసాదరెడ్డి, కారుమూరి భద్రయ్య, వైస్ సర్పంచ్ వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

క్రోసూరు, ఫిబ్రవరి 4 : ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం క్రోసూరు మండలంలోని ఊటుకూరు, దొడ్లేరు, గుడిపాడు గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఊటుకూరులో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, క్రోసూరులో జగనన్న ఇళ్ళ కాలనీలో నిర్మించిన మసీదును, గుడిపాడులో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. క్రోసూరులోని పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఆయనతో పాటు మార్కెట్ యార్డు ఛైర్మన్ ఈదా సాంబిరెడ్డి, పార్టీ నాయకులు కే.శ్రీనివాసరెడ్డి, ప్రభాకరరెడ్డి, బీ.రోశయ్య, షేక్ ఖాదర్, డాక్టర్ మహమ్మద్ షరీఫ్, నర్రా శేషయ్య తిప్పిరెడ్డి అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆర్థిక సహాయం

అచ్చంపేట, ఫిబ్రవరి 4 : మండలంలోని పెదపాలెం గ్రామంలో గత 15 రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్ళు కాలిపోయిన దంతాల నాగరాజు గృహానికి ఆదివారం స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు. రూ.75 వేలు విలువ గల వస్తు సామగ్రి, ఇటుకలు, రేకులు, ఇనుము, సిమెంట్ కట్టలు, సిమెంట్ పోల్స్ అందజేశారు. రూ.25 వేలు ఖర్చుల నిమిత్తం చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మన్నెం భద్రయ్య, నెల్లూరి వెంకటయ్య, చిరుమామిళ్ళ నరసింహారావు, స్నేహ హస్తాల కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలు

అచ్చంపేట, ఫిబ్రవరి 4 : మండలంలోని తాడువాయి పంచాయతీ పరిధిలోని సంద్ర తండా వద్ద ఆదివారం ఉదయం గుంటూరుకు చెందిన కేసీరెడ్డి కళాశాల విద్యార్థి రాజశేఖర్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనటంతో కాలికి తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరు నుంచి రాజశేఖర్ తన స్నేహితులు ఇద్దరితో కలసి పులిచింతల ప్రాజెక్టు చూసేందుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా తాడువాయికి చెందిన నాయక్ ట్రాక్టర్ ఢీకొనటంతో ఈ ఘటన చోటు చేసుకుంది. రాజశేఖర్‌ను 108 వాహనం ద్వారా సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్వల్ప గాయాలైన వారికి ప్రాథమిక చికిత్స చేశారు. అచ్చంపేట పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

అవినీతి వైసీపీని గద్దె దించుదాం

అచ్చంపేట, ఫిబ్రవరి 4 : మండలంలోని అంబడిపూడి గ్రామంలో ఆదివారం రాత్రి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. టీడీపీ, జనసేన ప్రవేశపెట్టిన ఉమ్మడి మానిఫెస్టోను ఇంటింటికి వెళ్ళి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, స్వామి, మచ్చా సూరయ్య, బత్తుల శ్రీనివాసరావు, వాసిరెడ్డి రవిచందు, వెనిగండ్ల కోటయ్య, తిరువాయిపాటి ఆంజనేయులు, నెల్లూరి వెంకటయ్య, దిబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ నిర్మూలన చంద్రబాబుతోనే సాధ్యం

- టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, ఫిబ్రవరి 4 : రాష్ట్రానికి బడా పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగ నిర్మూలన సమస్యను పరిష్కరించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించటం టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుకే సాధ్యమని తెలుగుదేశం, జనసేన నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని నెమలిపురి గ్రామంలో ఆదివారం ఎన్నికల శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నాను గ్రామస్తులు గజమాలతో సత్కరించి ఆహ్వానం పలికారు. అనంతరం కన్నా లక్ష్మీనారాయణ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఈ సందర్భంగా కన్నా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తెలుగుదేశం పార్టీని అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికలకు ముందు నేటి సీఎం జగన్‌రెడ్డి సీపీఎస్ రద్దు చేస్తానని, సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తానని, ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తానని అలివిగాని హామీలు ఇచ్చి ప్రజలను నట్టేట ముంచాడని ఆరోపించారు. నిత్యవసర వస్తువులు ధరలు రోజురోజుకు ఆకాశాన్ని అంటుతూ సామాన్య ప్రజలకు పూట గడవని పరిస్థితి ఎదుర్కొంటున్నారని చెప్పారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు తోట నరసయ్య, మాజీ ఎంపీపీలు గుత్తా వెంకట్రావు, నర్రా బాబురావు, మండల పార్టీ మాజీ అధ్యక్షులు అంచుల నరసింహారావు, పార్లమెంటు నాయకులు అంకాల ప్రభుదాసు, మండల పార్టీ ఉపాధ్యక్షులు వల్లా శ్రీనివాసరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు రాఘవరావు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు నల్లగొర్ల నరసింహారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శనగపోల వెంకయ్య, మాజీ సర్పంచులు వాసా వెంకటేశ్వర్లు, దొడ్డ అప్పారావు, సులగా వెంకటప్పయ్య, ముత్రిబోయిన వెంకటప్పయ్య, లేబాకుల బ్రహ్మయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి షేక్ అల్లాబక్షు, నల్లమోతుల శ్రీనివాసరావు, గణేష్, వెంకట్రావు ఉన్నారు.



కన్నా లక్ష్మీనారాయణకు హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

అంబటి నోరు అదుపులో పెట్టుకో : దివ్వెల

సత్తెనపల్లి, ఫిబ్రవరి 4 : మంత్రి అంబటి రాంబాబు నోరు అదుపులో పెట్టుకోవాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధినేత పైన కాని, టీడీపీ నాయకుల పై గాని అంబటి విమర్శలు చేస్తే సహించేదే లేదన్నారు. తమ అధినాయకుని మెప్పు పొందేందుకు చంద్రబాబు నాయుడు, లోకేశ్‌ల పై విమర్శలు చేయటాన్ని ఆయన ఖండించారు. నియోజకవర్గంలో వైసీపీ నేతలే అంబటి రాంబాబు ఎప్పుడు సత్తెనపల్లి వదిలి పోతాడా అని ఎదురు చూస్తున్నారు. అధికార పార్టీ నేతలే అంబటికి బుద్ధి చెబుతారన్నారు.

అంబటి ఓటమి ఒప్పుకున్న వైసీపీ నాయకులు : బత్తుల

సత్తెనపల్లి, ఫిబ్రవరి 4 : మంత్రి అంబటి రాంబాబు ఓటమిని వైసీపీ నాయకులే ఒప్పుకుంటున్నారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల ఆదినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబటి రాంబాబు నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోకుండా అందిన కాడికి దోచుకొని దాచుకున్నారన్నారు. అధికారాన్ని తన సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకున్న అంబటికి నియోజకవర్గ ప్రజలు గుణపాఠం చెప్పటం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

వన్నాయపాలెంలో 'మన ఇంటికి మన కొమ్మాలపాటి' కార్యక్రమం

బెల్లంకొండ, ఫిబ్రవరి 4 : బెల్లంకొండ మండలంలోని వన్నాయపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ఆదేశాల మేరకు 'మన ఇంటికి మన కొమ్మాలపాటి' కార్యమాన్ని చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వన్నాయపాలెం గ్రామంలో పుర వీధుల్లో గల గృహాలకు వెళ్ళి తెలుగుదేశం ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి, బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, ఓర్సు రాంబాబు, గుడిసె కొండయ్య, సయ్యద్ జబ్బార్, చెల్లుబోయిన శ్రీనివాసరావు, రామారావు, పార్టీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, మాజీ సర్పంచ్ పుల్లారావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణా రివర్ ఈత పోటీల్లో సత్తెనపల్లి వాసులు



ఈత పోటీల్లో పాల్గొన్న సత్తెనపల్లి వాసులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 4 : ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ కృష్ణా నది వద్ద ఆదివారం జరిగిన 24వ కృష్ణా రివర్ క్రాస్ 1.5 కిలో మీటర్ల ఈత పోటీల్లో సత్తెనపల్లి వాసులు పాల్గొని ప్రతిభ చూపారు. సత్తెనపల్లికి చెందిన నిమ్మగడ్డ హనుమంతరావు, మహమ్మద్ ఘనీ, షేక్ మహబూబ్ సైదా ఈత పోటీల్లో పాల్గొన్నారు. 61 సంవత్సరాల విభాగంలో నిమ్మగడ్డ హనుమంతరావు రెండవ విజేతగా నిలిచినట్లు వారు తెలిపారు.

లయన్స్ క్లబ్ సమావేశం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 4 : లయన్స్ క్లబ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం లయన్స్ గవర్నర్ మేళం కృపానందం, పూర్వ గవర్నర్ విజయ కుమార్‌రెడ్డి అధ్యక్షతన లయన్స్ క్లబ్ సమావేశం జరిగింది. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి సభ్యులు వివరించారు. ఉత్తమ సేవలు అందించిన లయన్స్ క్లబ్ సభ్యులకు అవార్డులు అందించారు. కార్యక్రమంలో తోట చిన సాంబశివరావు మంచి కంటి వెంకటేశ్వర్లు, పెద్దింటి వెంకటేశ్వర్లు, పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత రక్త పరీక్షలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 4 : పట్టణంలోని 1, 2, 3 వార్డుల్లో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఉచిత రక్త పరీక్షల మెడికల్ క్యాంపును టీడీపీ నేతలు నిర్వహించారు. ప్రజలకు ఉపయోగపడేలా క్యాంపులు ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులను టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావులు అభినందించారు. రెండు వందల మందికి రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో నూర్ బాషా జానీ బాబు, మద్దిగుంట బాల కోటయ్య, మామిడి వెంకటేశ్వరరావు, అంకాళ్ళ ఆదినారాయణ, జాలయ్య, బుచ్చిబాబు, శంకర్ నాయక్, జోరిగె శ్రీనివాసరావు, జింకా లోకేశ్వరరావు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న చిత్రం

గురజాలటౌన్, ఫిబ్రవరి 4 : క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఆదివారం వాగ్దేవి ఫార్మసీ కళాశాల విద్యార్థులు క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ జరిపారు. ఈ ర్యాలీలో మున్సిపల్ ఛైర్మన్ పోలు పవన్మయి వీరారెడ్డి మాట్లాడుతూ పొగాకు, ప్లాస్టిక్ వాడకం వలన క్యాన్సర్ పెరుగుతోందని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే క్యాన్సర్‌ను నిరోధించవచ్చని అన్నారు. అనంతరం ప్రతి దుకాణం వద్దకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు మద్దినేని వెంకటేశ్వర్లు, ఉల్లి సుబ్బారావు, ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేటి నుంచి ప్రయోగ పరీక్షలు

● జిల్లాలో 84 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

నరసరావుపేట, ఫిబ్రవరి 4: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సోమవారం నుంచి జరిగే ప్రయోగ పరీక్షలకు 84 కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా పరీక్షలు నిర్వహించనున్నారు. ఏర్పాట్లను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం నీలావతిదేవి పర్యవేక్షించారు. వృత్తి విద్యా కోర్సులకు 5నుంచి, సాధారణ కోర్సుల విద్యార్థులకు 11నుంచి 20వరకు ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. మార్చి 1 నుంచి 20వరకు థియరీ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు 48 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వాయిదాపడిన పర్యావరణ విద్య పరీక్ష ఈ నెల 23న నిర్వహించనున్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

ఆడుదాం-ఆంధ్ర క్రీడల విజేతలకు బహుమతుల పంపిణీ

శావల్యాపురం, ఫిబ్రవరి 4: నర్సరావుపేటలోని డీఎస్ఏ స్టేడియంలో జరిగిన ఆడుదాం-ఆంధ్ర జిల్లాస్థాయి క్రీడాపోటీలలో విజయం సాధించిన జట్లకు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ బహుమతులు అందచేసినట్లు వినుకొండ నియోజకవర్గ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ రాగుల రాధాకృష్ణమూర్తి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గం నుంచి ఖోఖోలో ఈపూరు మహిళల జట్టు ప్రథమ స్థానాన్ని, కబడ్డీలో వినుకొండ పురుషుల జట్టు ప్రథమస్థానాన్ని సాధించాయన్నారు. క్రికెట్‌లో శావల్యాపురం మహిళల జట్టు ద్వితీయ స్థానాన్ని, ఖోఖోలో ఈపూరు పురుషుల జట్టు ద్వితీయస్థానాన్ని, బ్యాడ్మింటన్‌లో వినుకొండ పురుషుల జట్టు ద్వితీయ స్థానాన్ని సాధించాయన్నారు. ప్రథమస్థానం సాధించిన జట్లకు రూ.60వేలు, ద్వితీయస్థానం సాధించిన జట్లకు రూ.30వేలు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు, కప్‌లు, మెమెంటోలను కలెక్టర్ అందజేసి క్రీడాకారులను అభినందించినట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమస్థానం సాధించిన ఈపూరు మహిళల ఖోఖో జట్టు, వినుకొండ పురుషుల కబడ్డీ జట్టు ఈ నెల 9 నుంచి 13 వరకు విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి ఆడుదాం-ఆంధ్ర పోటీలలో పల్నాడు జిల్లా తరఫున పాల్గొంటాయని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు అభినందించినట్లు తెలిపారు.

ప్రజా వ్యతిరేక సునామీలో

జగన్‌రెడ్డి కొట్టుకుపోవడం ఖాయం

● టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 4: ప్రజా వ్యతిరేక సునామీలో జగన్‌రెడ్డి కొట్టుకుపోవడం ఖాయమని టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. చంద్రబాబు నాయుడు రా.. కదిలిరా సభలకు వస్తున్న ప్రజాదరణ చూసి వైసీపీ ఫ్యాను రెక్కలు విరిగిపోతున్నాయన్నారు. మారీచుడు యజ్ఞాన్ని భగ్నం చేసినట్టు రాష్ట్ర అభివృద్ధిని, ప్రజాసంక్షేమాన్ని ధ్వంసంచేసిన జగన్‌రెడ్డికి ఓటనే ఆయుధంతో రాజకీయ సమాధి కట్టడం ఖాయమన్నారు. యుద్ధానికి ముందే ఓటమి ఒప్పుకున్న పిరికిపంద జగన్ రెడ్డి మాపై విమర్శలు చేయడమా? అన్నారు. తాడేపల్లి ప్యాలెస్ గేటు ముందు జగన్‌పై శాపనార్థాలు పెడుతున్న వైసీపీ ఎమ్మెల్యేలే ఈ ఓటమికి సజీవ సాక్ష్యాలు అన్నారు. సొంతపార్టీ ఎమ్మెల్యేలను కలిసేందుకు కూడా ఇష్టపడని నువ్వు పెత్తందారుడు కాక మరేమిటన్నారు. ధరలు, పన్నులు, చార్జీలు బాదుడుతో ప్రజల నడ్డి విరిచేయడమా? సంక్షేమం అంటే అని ప్రశ్నించారు. 2024లో ఎన్నికలలో వైసీపీ ఓటమి ఖాయం అన్నారు.



గుమ్మడిని సన్మానిస్తున్న పట్టణ ప్రముఖులు, కళాకారులు

అవార్డు గ్రహీతకు సన్మానం

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 4: సామాజిక సేవలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డు పొందిన గుమ్మడి వెంకటేశ్వర్లును పట్టణంలోని ప్రముఖులు, కళాకారులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆర్టీసీలో చిరుఉద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తూ గుమ్మడి వృద్ధాశ్రమం ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ మేనేజర్ జీవీ రమణ, న్యాయవాదులు పొట్లూరి సైదారావు, షేక్ సిద్ధయ్య, రామ్మోహన్‌రావు, కవి కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు

ఆర్ఎంపీ, పీఎంపీల ర్యాలీ

వినుకొండ, ఫిబ్రవరి 4 : హలో ఆర్ఎంపీ, పీఎంపీ చలో విజయవాడ రాష్ట్రసదస్సుకు నియోజకవర్గం నుంచి ఆదివారం ఆర్ఎంపీలు, పీఎంపీలు తరలివెళ్లారు. ముందుగా పట్టణంలోని బస్టాండ్ సెంటర్ నుంచి శివయ్యస్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గ్రామీణ వైద్యులను గుర్తిస్తూ ఇచ్చిన 429 జీవోను అమలు చేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి అనంతరం విజయవాడకు తరలివెళ్లారు. కార్యక్రమంలో బ్రహ్మానందం, వెంకటేశ్వరరెడ్డి, బ్రహ్మయ్య, సాంబశివరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతగుడిపాడు జడ్పీ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రొంపిచర్ల, ఫిబ్రవరి 4: మండలంలోని సంతగుడిపాడు జడ్పీ పాఠశాలలో 1979-80 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. తాము చదువుకున్న పాఠశాలలో కలియతిరిగారు. తాము ఏఏ హోదాల్లో ఉంది తెలియజేశారు. పూర్వ విద్యార్థులంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలాముద్దీన్

ముస్లింల ఆత్మీయ సమావేశం

వినుకొండ, ఫిబ్రవరి 4: పట్టణంలోని జాషువా కళాప్రాంగణంలో ఆదివారం ముస్లిం చైతన్య పోరాట సమితి ఆధ్వర్యంలో ముస్లింల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు కలాముద్దీన్ మాట్లాడుతూ ముస్లింల సమాజ ఐక్యత కోసమే పనిచేస్తున్నామని, ముస్లింలు విద్య, సామాజిక, ఆర్థిక రాజకీయంగా వెనుకబాటుతనానికి గురవుతున్నారని, వారి అభ్యున్నతి కోసం సమితి పనిచేస్తుందని, ముస్లింల ఐక్యతను దెబ్బతీయాలని ప్రయత్నించేవారు ఎవరైనా ఓటు ద్వారా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట సమితి వ్యవస్థాపకుడు బాజీద్, సూఫీ ఇమ్రాన్, వహిద్ అహమ్మద్, ముఫ్తి అబ్దుల్ రెహమాన్, ముఫ్తి జమీర్, ఖాశీం, మార్కెట్ సైదావలి, నాయబ్ రసూల్, వలివుల్లా, ఆయాజ్, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఓటు బ్యాంకు రాజకీయాలకు జగన్‌రెడ్డి కుట్రలు

జయహో బీసీ సభలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర



జయహో బీసీ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 4: ఓటు బ్యాంకు రాజకీయాలకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కుట్రలు పన్నుతున్నారని మాజీమంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో జమీందారు ఫంక్షన్ ప్లాజాలో జయహో బీసీ కార్యక్రమం జరిగింది. టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పల్నాడు జిల్లావ్యాప్తంగా బీసీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో బీసీలను అణగదొక్కే కార్యక్రమాన్ని రాష్ట్రంలో అమలుచేశారన్నారు. బీసీలను మరోసారి బానిసలుగా చేసుకునేందుకు జగన్‌రెడ్డి యత్నిస్తున్నాడన్నారు. తెలుగుదేశం పార్టీలో ఉన్న బీసీ నాయకులను అణిచివేయాలని అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, కొల్లు రవీంద్రల మీద నిర్భయ, హత్య కేసులు పెట్టారని గుర్తుచేశారు. తెలుగుదేశం పార్టీకి అండగా ఉంటున్నారని అనేకమంది బీసీలను జగన్‌మోహన్‌రెడ్డి పొట్టనపెట్టుకున్నారని అన్నారు. పల్నాడు జిల్లాలో తోట చంద్రయ్య, కడప జిల్లాలో చేనేతవర్గానికి చెందిన వ్యక్తి సుబ్బయ్యను, రేపల్లేలో అమర్నాథ్‌గౌడ్, మాచర్లలో దుర్గారావు అనే మత్స్యకారుడుని పొట్టన పెట్టుకున్నారని అన్నారు. బీసీలను ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్నారని, 56 కార్పొరేషనులు అని, ఎక్కడ పైసా ఇవ్వలేదన్నారు. ఈ ప్రభుత్వంలో జరిగిన ప్రతి అన్యాయం మీద ప్రతి గడపకు వెళ్లి ఈ ముఖ్యమంత్రిని రాష్ట్రాన్నించి వెళ్లగొట్టి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసుకోవాలనే ఏకైక లక్ష్యంలో పనిచేయాలన్నారు. తిరుమల దేవస్థానం ఈవోగా ముఖ్యమంత్రి వర్గానికి చెందిన వారినే నియమించారని, టీడీపీ హయాంలో సుధాకర్‌యాదవ్, వెంకటరావులు చైర్మన్లుగా చేశారని గుర్తుచేశారు. సలహాదారులలో ఎంతమంది బీసీలు ఉన్నారో జగన్‌మోహన్‌రెడ్డి లెక్క చెప్పగలరా? అని ప్రశ్నించారు. టీడీపీ ఆర్థిక శాఖ యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, అనేక మంది బీసీ సోదరులు మంత్రులుగా, కేంద్రమంత్రులుగా పనిచేశారని అన్నారు. ఇవాళ సామాజిక బస్సుయాత్ర అని పెట్టి మళ్లీ బీసీలను మోసం చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి చూస్తున్నారని విమర్శించారు. ఐదు సంవత్సరాలు సమయం సరిపోక కులగణన పేరుతో ఎన్నికలు రెండు నెలలు ఉన్న సమయంలో మళ్లీ ఓట్లు కొల్లగొట్టడానికి చూస్తున్నారని అన్నారు. ఎవరైనా ఉద్యోగులకు బదిలీలు చేస్తారని, కాని వైసీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి మంత్రులకు, ఎమ్మెల్యేలకు బదిలీలు చేస్తున్నారన్నారు. టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ బీసీ మంత్రులను జగన్‌మోహన్‌రెడ్డి గొంతునొక్కరన్నారు. జగన్‌రెడ్డి బీసీల గొంతుకోసి ఉన్న 36 సంక్షేమ పథకాలు తీసివేశారని విమర్శించారు. రానున్న రోజులలో టీడీపీ జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, బీసీలకు న్యాయం చేస్తామని, మళ్లీ 34శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని అన్నారు, బీసీలకు చంద్రబాబునాయుడు రక్షణ చట్టం తీసుకురాబోతున్నారని అన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ బీసీలకు అండగా ఉంటానని, పార్టీకోసం ప్రాణాలు అర్పిస్తానని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్ సభకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నల్లపాటి రామచంద్రప్రసాదు, దాసరి నరసింహారావు, టీడీపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు, మద్దిరాల గంగాధర్, రాష్ట్ర హెచ్‌ఆర్‌డీ సభ్యుడు వల్లెపు నాగేశ్వరరావు, తాడిబోయిన చంద్రశేఖర్‌యాదవ్, కొలికొండ కొండలు, తిరుమలకొండ నర సింహారావు, కొలిపాక చంద్రశేర్, జనసేనషేక్ అబ్దుల్ రవూఫ్, డాక్టర్ కడియాల లలిత్ సాగర్, తదితరులు పాల్గొన్నారు. సభలో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలను ఆవిష్కరించారు.

ఎన్నికల ముందు కులగణన అంటూ మోసం

వినుకొండటౌన్, ఫిబ్రవరి 4: ఎన్నికలకు ముందు కులగణన అంటూ ఓటీపీలతో బీసీలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద న్యాయవాది సైదారావు అధ్యక్షతన జయహో బీసీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా మహాత్మ జ్యోతిరావుపూలే చిత్రపటానికి, అన్న నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జయహో బీసీ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి బీసీలు పెద్దసంఖ్యలో పాల్గొనడంతో ఆ ప్రాంతం జనసంద్రంగా మారింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు పెద్దఎత్తున గుర్తింపు ఇచ్చిన ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల గంగాధర్, బీమవరపు సుబ్బారావు, జనసేన సమన్వయకర్త కొంజేటి నాగశ్రీనురాయల్, దుమ్మాలపాటి మల్లికార్జున్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, తెలుగుదేశం పార్టీ నాయకులు జ్ఞానేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలు తీరిస్తేనే ఏ కళకైనా మనుగడ

● పద్మశ్రీ నాజర్ కుమారుడు బాపూజి

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 4: ప్రజల అవసరాలు తీర్చితేనే ఏ కళకైనా మనుగడ ఉంటుందని, కలకాలం నిలుస్తుందని బుర్రకథ పితామహుడు పద్మశ్రీ షేక్ నాజర్ తనయుడు షేక్ బాపూజి అన్నారు. ఆదివారం పట్టణంలోని టైనీటాట్స్ స్కూల్‌లో పల్నాడు బాలోత్సవం కమిటీ బుర్రకథా పితామహుడు పద్మశ్రీ షేక్ నాజర్ 124 జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన బుర్రకథల వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుర్రకథల పునరుద్ధరణ జరగాలంటే ప్రజల అవసరాలకు అనుగుణమైన ఇతివృత్తాలను తీసుకుని ముందుకెళ్లాలన్నారు. మన ప్రాచీన కళారూపాలను బతికించుకోవాలంటే ప్రభుత్వాలు, విశ్వ విద్యాలయాలు పూనుకోవాలని చెప్పారు. కళలకు సంబంధించిన సిద్ధాంత గ్రంథాలకు ఇచ్చే ప్రోత్సాహకాలు పెంచాలన్నారు. కళాకారుల శిక్షణ కోసం ఉద్దేశించిన గ్రంథాలు తయారుచేసే వారికి ప్రోత్సాహం అందడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. ఏ కళకైనా సిద్ధాంత గ్రంథాలు ఎన్ని ఉన్నప్పటికీ దాన్ని నేర్పే విధానం తెలియకపోతే నిరుపయోగమని పేర్కొన్నారు. బాలోత్సవం కమిటీ అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన బాలోత్సవంలో బుర్రకథల పోటీలకు పల్నాడు జిల్లాలో కేవలం 4టీంలు మాత్రమే వచ్చాయని, అందుకే ఈ కళారూపం అభివృద్ధికి కమిటీ ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిందని తెలిపారు. ఈ యేడాది మేలో బుర్రకథల మేళాను నిర్వహించాలని కమిటీ నిర్ణయించిందని చెప్పారు. సమావేశానికి కమిటీ కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కాగా కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఎంఎస్ ఆర్కేప్రసాద్, సభ్యులు కె.రామారావు, మేడా సాంబశివరావు, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, టి.అంజిరెడ్డి, స్వర్ణరామిరెడ్డి, కె.శివపార్వతి, బి.సలీం, టైనీటాట్స్ డైరెక్టర్ పి.కోటేశ్వరమ్మ, ఓబయ్య, యేసు తదితరులు పాల్గొన్నారు.



పద్మశ్రీ నాజర్‌కు నివాళులర్పిస్తున్న ఆయన కుమారుడు బాపూజి, పల్నాడు బాలోత్సవం కమిటీ

పొట్లూరులో 200 మందికి వైద్య పరీక్షలు



పొట్లూరులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రమేష్

పొట్లూరు (శావల్యాపురం) ఫిబ్రవరి 4: నరసరావుపేటకు చెందిన నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో శావల్యాపురం మండలం, పొట్లూరులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించింది. నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యాధికారి నెల్లూరి రమేష్ పాల్గొని మెదడు, నరాలు, బీపీ, షుగర్ తదితర వ్యాధులతో బాధపడుతున్న 200మంది రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ పేదలకు ఉన్నతమైన వైద్యసేవలను ఉచితంగా అందించడమే లక్ష్యంగా నెల్లూరి హాస్పిటల్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ప్రతినెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసీ అసిస్టెంట్ మల్లికార్జున్, మేనేజర్ కిరణ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ శివ, జ్ఞానకుమారి పాల్గొన్నారు.

అన్నవరంలో ఓటర్ల డబుల్ ఎంట్రీలను తొలగించాలి

● టీడీపీ నాయకుల డిమాండ్

రొంపిచర్ల, ఫిబ్రవరి 4: మండలంలోని అన్నవరంలో డబుల్ ఎంట్రీగా ఉన్న ఓట్లను తొలగించాలని టీడీపీ నాయకులు ఆదివారం డిమాండ్ చేశారు. సుమారు సంవత్సర కాలం నుంచి అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఈ ఓట్లు 63, 64 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్నాయన్నారు. వీరికి నరసరావుపేటలో కూడా పలు పోలింగ్ స్టేషన్‌లలో ఓటు హక్కు ఉందని తెలిపారు. వివరాలతో తెలియజేసినా స్పందించటం లేదన్నారు. బూత్‌లెవల్ అధికారులు వెళ్ళినప్పుడు ఎక్కడో ఒకచోట ఉంచుకుంటామని చెపుతున్నారని, రెండోచోట తమ ఓటును తొలగించటం లేదని తెలిపారు. అధికారులు స్పందించి విచారణ జరిపి రెండు చోట్ల ఉన్న ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

కారుమంచిలో ప్రారంభం కాని రేషన్ పంపిణీ

కారుమంచి (శావల్యాపురం) ఫిబ్రవరి 4: మండలంలోని అన్ని గ్రామాలలో ఈ నెల 1వ తేదీన రేషన్ పంపిణీ ప్రారంభమైనప్పటికీ కారుమంచిలో మాత్రం ఇంతవరకు రేషన్ పంపిణీ ప్రారంభం కాలేదు. కారుమంచి ఎండీయూ ఆపరేటర్ కారుమంచి ఆంజనేయులు గత డిసెంబరు నెలలో వ్యక్తిగత కారణాలతో రేషన్ పంపిణీ చేయకపోవడంతో అప్పటి తహసీల్దార్ జాన్‌సైదులు వీఆర్వోల పర్యవేక్షణలో రేషన్ డీలర్ల ద్వారా కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయించారు. ఎండీయూ ఆపరేటర్ ఆంజనేయులు తిరిగి విధులలోకి చేరుతున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకట నాగరాజుకు జనవరి 4వతేదీన లిఖితపూర్వకంగా రాసిచ్చినా అతన్ని విధుల్లోకి తీసుకోకుండా జనవరి నెలలో కూడా రేషన్ డీలర్ల చేతనే రేషన్ పంపిణీని కొనసాగించారు.

కానీ ఈ నెలలో 4వ తేదీ ముగుస్తున్నా ఎండీయూ ఆపరేటర్ గానీ, రేషన్ డీలర్లు గానీ ఇంతవరకు రేషన్ పంపిణీ ప్రారంభించకపోవడంతో కార్డుదారులలో ఆందోళన నెలకొంది. కారుమంచిలో సుమారు 1400మంది కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయాల్సి ఉండగా 17వ తేదీతో రేషన్ పంపిణీ ముగుస్తుండడంతో రేషన్ సరుకులు అందరికీ అందుతాయో, లేదోనన్న అనుమానాలు గ్రామస్థులలో నెలకొన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రేషన్ పంపిణీని వెంటనే ప్రారంభించి కార్డుదారులందరికీ సరుకులు అందించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల, ఫిబ్రవరి 4: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నలగార్లపాడులో రూ.21 లక్షల నిధులతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆరోగ్యంలో చిన్న సమస్యలు తలెత్తినప్పుడు మర్రిచెట్టుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళాల్సి వచ్చేదని, ప్రస్తుతం ఇక్కడ ఈ క్లినిక్‌ను ప్రారంభించటం వల్ల వైద్య పరీక్షలు, మందులు ఇక్కడే అందుబాటులో ఉంటాయన్నారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకు వచ్చారన్నారు. రాష్ట్రంలోని సచివాలయాలు ఉన్న చోట క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేగాక క్లినిక్‌ల వద్ద నలుగురు సిబ్బంది అందుబాటులో ఉంటారని, వారంలో మూడు రోజులు వైద్యులు ఇక్కడకు వస్తారని తెలిపారు. గ్రామ ప్రజలు క్లినిక్‌ను వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

చంద్రబాబును ప్రజలు నమ్మరు

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల, ఫిబ్రవరి 4: రాష్ట్ర ప్రజలు చంద్రబాబును నమ్మే పరిస్థితుల్లో లేరని, ఎన్నికలప్పుడే ప్రజలు చంద్రబాబు నాయుడుకు గుర్తుకు వస్తారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. మండలంలోని మునమాకలో గ్రామ సచివాలయం, సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.65లక్షల మేర అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలప్పుడు చంద్రబాబు నాయుడు ఏ పార్టీతోనైనా పొత్తు పెట్టుకుంటాడని విమర్శించారు. షర్మిల కూడా ఆయనకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నరసరావుపేట టీడీపీ ఇన్‌చార్జ్ కల్లబొల్లి మాటలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. మునమాకలో గతంలో వచ్చిన మెజార్టీ కంటే ఈసారి అధిక మెజార్టీ రావాలని కోరారు. ఇటీవల టీడీపీలో పలువురు చేరారని అరవిందబాబు చెప్పుకుంటున్నారన్నాడని, వారుమరలా వైసీపీలో చేరారని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, కరిముల్లా, జి.వెంకటేష్, సయ్యద్ జాన్ సైదా, వివిధ గ్రామాల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణవేణి కళాశాలలో ఫేర్‌వెల్ డే

వినుకొండటౌన్, ఫిబ్రవరి 4: పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పట్టణ సీఐ సాంబశివరావు, కండ్లగుంట హెచ్ఎం బి.వరప్రసాద్, పుల్లారావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారు విలువైన పలు సూచనలు తెలియజేసి ఇంటర్ పూర్తయిన తరువాత మంచి భవిష్యత్ కోసం చేపట్టాల్సిన వాటిపై సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లింగారావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పాత కక్షల నేపథ్యంలో వ్యక్తికి కత్తిపోట్లు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 4: రాజుపాలెం మండలం పెద నెమలిపురికి చెందిన వేముల వీరయ్యను అదే గ్రామానికి చెందిన మల్లికార్జునరావు కత్తితో పొడిచి గాయపరిచాడు. వేముల వీరయ్య, అతని స్నేహితుడు సాంబశివరావులు ఆదివారం నెమలిపురి నుంచి మోటారు సైకిల్‌పై పిడుగురాళ్ళ వైపు వెళుతుండగా అదే గ్రామానికి చెందిన మల్లికార్జునరావు కత్తితో పొడిచి గాయపరిచాడు. కుటుంబ సభ్యులు వీరయ్యను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. వీరయ్య ఫిర్యాదు మేరకు రాజుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి

జగన్ అబద్ధాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 4: జగన్ అబద్దాల యుద్ధాన్ని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, సిద్ధం అంటూ ఊరూరా సభలు పెట్టిన జగన్ చెప్పిన అబద్ధాలను మళ్ళీ మళ్ళీ చెపుతూ జనాలను మోసం చేయాలని చూస్తున్నారని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. చిలకలూరిపేట పట్టణంలోని సుగాలీ కాలనీ, మార్కండేయ నగర్, భావనరుషి నగర్ ప్రాంతాలకు చెందిన పలు కుటుంబాలు బీటా బ్రహ్మం సారథ్యంలో ఆదివారం ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్తిపాటి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ అడుగుతున్నట్లు ప్రజలు కూడా బటన్ నొక్కటానికి సిద్ధంగా ఉన్నారని, కాని అది అతడిని, అతడి గ్యాంగ్‌ని ఇంటికి పంపించటానికేనని గుర్తుంచుకోవాలన్నారు. సిద్ధం సభల్లో మాట్లాడితే 99శాతం హామీలు అమలు చేశామంటున్న జగన్ ఈ విషయంలో టీడీపీతో చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో జగన్ అబద్ధాలను, విషపు ప్రచారాన్ని ఎక్కడికక్కడ ఎండగట్టడంతో పాటు అంతా ఐక్యంగా పనిచేసి టీడీపీ, జనసేన అభ్యర్థిని గెలిపించుకుందామన్నారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థికసాయం

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 4: చిలకలూరిపేట మండలంలోని గోపాళంవారిపాలెం గ్రామానికి చెందిన కిన్నెర నాగేష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వారి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ.10వేలు ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జువ్వాజి మదన్ మోహన్, పార్టీ నాయకులు చిన్నం రవి, గోపాళం సాగర్, పిన్నమనేని దిలీప్, గంజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లకు కూడా దిక్కులేని పరిస్థితి

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 4: అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లకు కూడా దిక్కులేని పరిస్థితి రాష్ట్రానికి తెచ్చిన ఘనత కేవలం ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికే దక్కుతుందని మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని గౌడ కళ్యాణ మండపంలో హాస్తుబా సోషల్ అండ్ కల్చరల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గోమాత నవీన్ నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రత్తిపాటి ప్రారంభించారు. పేదల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించటం అభినందనీయమన్నారు. మారుమూల ప్రాంతాల్లోనే కాకుండా పట్టణాలు, నగరాల్లో కూడా అత్యవసరమైనప్పుడు అంబులెన్స్ సేవలకు అవస్థలు పడుతున్నారన్నారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని, 108, 104 అంబులెన్స్ వ్యవస్థను జగన్ ఎంత నీరుగార్చారో, ఎంత ఇబ్బంది పెడుతున్నారో సిబ్బంది సమ్మె నోటీసులే స్పష్టం చేస్తున్నాయన్నారు.

విపక్షాలు, ప్రజా సంఘాలంటే జగన్‌కు భయం: ప్రత్తిపాటి

● ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష

లింగారావుపాలెం (యడ్లపాడు), ఫిబ్రవరి 4: విపక్షాలు, ప్రజా సంఘాలంటే ముఖ్యమంత్రి జగన్‌కు భయం పట్టుకుందని, సభలు, సమావేశాలకు వెళ్ళినా, ఆఖరుకు పరామర్శకు వెళ్ళినా ముందుగా ఆ ప్రాంతంలోని విపక్ష నేతలను, ప్రజాసంఘాల నాయకులను అరెస్ట్ చేయడం లేదా గృహనిర్బంధం చేయడం అందుకు నిదర్శనమని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఎన్నికల సన్నద్ధతపై మైదవోలు, లింగారావుపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలతో సమీక్షా సమావేశం శనివారం రాత్రి నిర్వహించారు. మండలంలోని లింగారావుపాలెంలో నిర్వహించిన ఈ సమీక్షలో ప్రత్తిపాటి పాల్గొని నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కామినేని సాయిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయికి కేరాఫ్ అడ్రస్‌గా రాష్ట్రం : ప్రత్తిపాటి

వంకాయలపాడు (యడ్లపాడు), ఫిబ్రవరి 4: రాష్ట్రాన్ని పెట్టుబడులకు కేంద్రంగా చంద్రబాబు తీర్చిదిద్దితే.. జగన్ మాత్రం గంజాయికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చాడని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. మండలంలోని వంకాయలపాడులో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ప్రభుత్వం అమలుచేయబోయే సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ గంజాయి రవాణాలో దేశంలోనే ఏపీని నెంబర్ వన్‌గా రాష్ట్రాన్ని నిలిపిన ఘనత జగన్‌దే అన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఏపీతో ముడిపడి ఉండడం ఒక ఎత్తయితే.. పోలీసులే పక్క రాష్ట్రాల్లో గంజాయి అమ్ముతూ పట్టుబడడం రాష్ట్ర పతనావస్థకు నిదర్శనమన్నారు. బస్సుల కోసం పరీక్షలను వాయిదావేసిన ఇలాంటి సైకోను ఎప్పుడూ చూడలేదన్నారు. విద్యావ్యవస్థను కూడా స్వార్థ రాజకీయాలకు బలిపెట్టడం దారుణమన్నారు. నిరుద్యోగులకైతే జగన్‌చేసిన మోసానికి కన్నీళ్ళే మిగిలాయన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకర్గ సమన్వయకర్త తోట రాజారమేష్ మండల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నడిగడ్డలో పట్టణ సీఐ పల్లెనిద్ర

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 4: మండలంలోని నడిగడ్డ గ్రామంలో పట్టణ సీఐ సాంబశివరావు పల్లెనిద్ర కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులతో రానున్న ఎన్నికల నేపథ్యంలో ఘర్షణలకు పాల్పడరాదని, తెలిసితెలియని వయసులో యువకులు ఘర్షణలకు పాల్పడి జీవితం పాడుచేసుకోవద్దని అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రశాంతంగా ఉండేవిధంగా చూడాలన్నారు. అరాచక శక్తులు గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట, ఫిబ్రవరి 4: శాసన మండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ ఆదివారం తన నివాస గృహంలో ఐదుగురు లబ్ధిదారులకు రూ.5లక్షలకు పైగా విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన షేక్ సాలి మున్నీసాకు రూ.3 లక్షల చెక్కును ఆయన అందజేశారు. అనారోగ్యంతో సతమతమవుతున్న వారికి ఈ సాయాన్ని అందజేశారు.

ఓపీఎస్‌పై పార్టీల వైఖరి వెల్లడించాలని యూటీఎఫ్ డిమాండ్

చిలకలూరిపేట, ఫిబ్రవరి 4: పాత పింఛన్ విధానం (ఓపీఎస్)పై రాజకీయ పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలని యూటీఎఫ్ నాయకులు ఆదివారం డిమాండ్ చేశారు. స్థానిక పండరీపురంలో ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా శాఖ గౌరవ అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జగన్ ఎన్నికల సమయంలో ఓపీఎస్ పునరుద్ధరణపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పాత పింఛన్ విధానాన్ని అమలుచేసే వారికే తమ ఓటు ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి తిరుపతిస్వామి, యూటీఎఫ్ నేతలు స్నేహలత, నాగమల్లేశ్వరరావు, ఉమా మహేశ్వరరావు, చంద్రశేఖరరావు, చెన్నకేశవ, సుధాకర హరిప్రసాదు, బాపయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొహియుద్దీన్ జయంతి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 4: ఎస్టీయూ వ్యవస్థాపకులు దివంగత మద్దుం మొహిద్దీన్ 117వ జయంతిని పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిజాం నిరంకుశ పాలనలో విద్య, ఉపాధ్యాయుల హక్కులను కాపాడేందుకు మొహియుద్దీన్ కొద్దిమందితో ఈ సంఘాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాన్ని అంకితం చేశారని ఎస్టీయూ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు కే కోటేశ్వరరావు, పోటు శ్రీనివాసరావు, వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, జయప్రకాష్, జమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.